TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు

# DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 34 | 15-06-2026 సోమవారం | పేజీలు: 06 | వెల: 3/-


## నూతన పోలీస్ స్టేషన్ల స్వంత భవనాలకు స్థలాల పరిశీలన.



03








## మా మంత్రులు, ఎంపీలే అన్ని చేస్తే.. ఇక సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు?

- తెలంగాణలో ఏ వర్గం సంతృప్తిగా లేదు
- ఇచ్చిన హామీలు అమలు
- చేయలేక అబద్ధాలు చెబుతున్నారు
- మా మంత్రులు, ఎంపీలే
- అన్ని చేస్తే, ఇక సీఎం ఎందుకు?

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

అంబర్‌పేట్ నియోజకవర్గంలో నిర్వహించిన బీజేపీ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై రామచందర్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణలో ప్రస్తుతం ఏ వర్గం ప్రజలు కూడా సంతృప్తిగా లేరని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని అబద్ధాలకు తల్లిగా అభివర్ణించిన ఆయన.. హామీలను నెరవేర్చలేక ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం మిగతా 2లో..

# రేవంత్ పాలన అట్టర్ ఫ్లాప్

- కాంగ్రెస్ హామీలు అమలు కాలేదు: కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్
- బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన కేటీఆర్
- రేవంత్ పాలనపై తీవ్ర విమర్శలు
- వేలాది ఇళ్ల కూల్చివేతలకు ప్రభుత్వం
- బాధ్యత వహించాలని డిమాండ్
- ఎన్నికల హామీలు అమలు చేయడంలో
- కాంగ్రెస్ విఫలమైందన్న ఆరోపణ
- ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలపై
- స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు
- పొడిచింది రేవంతేనని విమర్శ
- ఖైరతాబాద్‌కు త్వరలో ఉపఎన్నిక
- వచ్చే అవకాశం ఉందన్న వ్యాఖ్య
- కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపు
- బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని సూచన



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన ఫస్టాఫ్ పూర్తిగా అట్టర్ ఫ్లాప్‌గా మారిందని విమర్శించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని మండిపడ్డారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మిగతా 2లో..

# నేటి నుంచే బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ప్రారంభం

### ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకానికి శ్రీకారం

- ప్రభుత్వ విద్యాసంస్థల్లో అల్పాహార పథకం అమలు
- తొలి విడతలో 1,302 విద్యాసంస్థల్లో ప్రారంభం
- 1.44 లక్షల మంది విద్యార్థులకు నేరుగా లబ్ధి
- ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు 22 లక్షల మందికి విస్తరణ లక్ష్యం
- వారానికి ఆరు రోజులపాటు వేడి వేడి అల్పాహారం
- పాలు, రాగిజావతో పోషకాహారానికి పెద్దపీట
- పాఠశాలలతో పాటు జూనియర్ కాలేజీల్లోనూ అమలు
- రూ.720 కోట్ల భారీ వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- 39 కేంద్రీకృత వంటశాలల నిర్మాణానికి కార్యాచరణ
- ఆకలి నుంచి విద్యార్థులకు విముక్తి.. నాణ్యమైన విద్యకు బాటలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఉదయం ఆకలితో పాఠశాలకు వెళ్లే పిల్లల దృశ్యం ఇక గతం కానుంది. తరగతి గదిలో పుస్తకం తెరిచినా కడుపు నిండకపోతే చదువు మీద ఏకాగ్రత నిలవదన్న వాస్తవాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం మరో కీలక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులకు ఇకపై ఉదయం వేడి వేడి అల్పాహారం అందించనుంది. విద్య, ఆరోగ్యం, పోషకాహారం అనే మూడు ప్రధాన లక్ష్యాలను ఒకేసారి చేరుకునేలా రూపొందించిన ఈ బ్రేక్‌ఫాస్ట్ పథకం మిగతా 2లో..

## ఇక ప్రభుత్వ స్కూల్ పిల్లలూ కార్పొరేట్ స్టైల్‌లో..



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ప్రైవేటు..కార్పొరేట్ స్కూల్ విద్యార్థులు ధరించే మన్నికైన యూనిఫాంలు.. వారికి ఏమాత్రం తీసిపోని విధంగా బ్రాండెడ్ షూ.. సాక్సులు.. టై, బెల్టులు ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులకు అందనున్నాయి.. నాణ్యమైన వస్త్రం సరఫరా అయితేనే యూనిఫాంలు ఎక్కువ రోజులు మన్నుతాయి. అందుకే విద్యార్థులకు అందజేసే మిగతా 2లో..

- ఈ ఏడాది విద్యార్థులకు నాణ్యమైన సామగ్రి పంపిణీ
- గురుకులాల విద్యార్థులకు కిట్ల అందజేత...
- కిట్‌లో బెల్టు, టై, స్కూల్ బ్యాగ్, బూట్లు... బెడ్డింగ్ సామగ్రి
- ఇప్పటికే పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు...
- యూనిఫాం కుట్టు పనిలో
- నిమగ్నమైన మహిళా స్వయం సంఘాల సభ్యులు
- తొలిసారిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు
- బ్యాగు, బెల్టు, టై, బూట్లు, సాక్సులు
- విద్యా రంగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ...

## సింగరేణిపై దుష్ప్రచారం మానాలి

- బొగ్గు నిల్వల మాయంపై ఆరోపణలు నిరాధారమని స్పష్టం
- శ్రీరాంపూర్ ఓసీపీలో ఓపెన్‌హౌస్ నిర్వహించిన డిప్యూటీ సీఎం
- సింగరేణి కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దని హితవు
- బొగ్గు నిల్వలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్న భట్టి
- బొగ్గు రవాణాపై జీపీఎస్, విజిలెన్స్ నిఘా ఉందని వెల్లడి
- 'కిలో బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదు'
- ఎస్ఐఆర్ పేరుతో అసలైన
- ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- కాంగ్రెస్ మద్దతుదారుల ఓట్లనే లక్ష్యంగా చేసుకున్నారని విమర్శ
- 80 వేల మంది ఓటర్లు అన్‌మ్యాపింగ్ అయ్యారని వ్యాఖ్య
- సింగరేణిని కాపాడేది కాంగ్రెస్ మాత్రమేనని శ్రీధర్‌బాబు స్పష్టం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

సింగరేణి బొగ్గు నిల్వలు మాయమయ్యాయంటూ వస్తున్న ఆరోపణలను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు (ఓసీపీ) వద్ద ఆదివారం సింగరేణి అధికారులతో కలిసి నిర్వహించిన ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా హాజరయ్యారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల శ్రమ, చెమట, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిపై వస్తున్న మిగతా 2లో..

## హైదరాబాద్ లో గొంతెత్తిన కాక్రోచ్ జనతా పార్టీ

- నీట్ పేపర్ లీకేజీపై కేంద్రంపై ఆగ్రహం
- ధర్నాచౌక్‌లో భారీ ప్రదర్శన నిర్వహించిన యువత
- ఉద్యమంలో పాల్గొన్న సోనమ్ వాంగ్‌చుక్, ఆకునూరి మురళి
- విద్యా వ్యవస్థలో అవకతవకలపై తీవ్ర విమర్శలు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- రాజీనామా చేయాలని డిమాండ్
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దని హెచ్చరిక
- నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వాన్ని నిలదీసిన నేతలు
- యువతను 'కాక్రోచ్‌లు'గా అభివర్ణించడంపై ఆగ్రహం
- నైపుణ్యాభివృద్ధిలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపిన వక్తలు
- విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పరీక్షా పత్రాల లీకేజీలు, విద్యా వ్యవస్థలో నెలకొన్న అవకతవకలు, నిరుద్యోగ సమస్యలు, విద్యార్థుల భవిష్యత్తుపై పెరుగుతున్న అనిశ్చితిని నిరసిస్తూ ధర్నాచౌక్ వద్ద పెద్దఎత్తున ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్త, సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరులతో పాటు వందలాది మంది యువత, విద్యార్థులు పాల్గొన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంతో దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనను మిగతా 2లో..



## దమ్ముంటే శాసనసభ రద్దు చేయ్

- రేవంత్‌కు రఘునందన్ సవాల్
- అసెంబ్లీ రద్దు చేయాలని డిమాండ్
- రాజీనామాలకు బీజేపీ సిద్ధం
- ప్రజా తీర్పుకు రావాలన్న ఎంపీ

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రస్థాయిలో మండిపడుతూ ఘాటుగా ప్రతి సవాల్ విసిరారు. రాష్ట్రంలోని ఎనిమిది మంది బీజేపీ ఎంపీలం తమ పదవులకు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని, రేవంత్ రెడ్డికి చేతనైతే ముఖ్యమంత్రి మిగతా 2లో..



# నేటి నుంచే బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

నేటి నుంచి అమల్లోకి రానుంది.

**ఆకలి లేని ఉదయం..**

**ఆత్మవిశ్వాసంతో తరగతి గది**

పల్లె ప్రాంతాల్లోనూ, పట్టణ పేద కుటుంబాల్లోనూ చాలామంది పిల్లలు ఉదయం తగిన ఆహారం తీసుకోకుండానే పాఠశాలకు వెళ్తుంటారు. దీనివల్ల శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు పాఠశాలకు వచ్చిన వెంటనే పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 1,269 పాఠశాలలు, 33 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. మొత్తం 1,44,610 మంది విద్యార్థులు ప్రారంభ దశలో లబ్ధి పొందనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల మందికి లబ్ధి

ప్రస్తుతం ప్రారంభమవుతున్నది కేవలం తొలి అడుగు మాత్రమే. రానున్న నెలల్లో తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు ఈ పథకాన్ని విస్తరించనున్నారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న సుమారు 22 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం అందుబాటులోకి రానుంది. దీంతో దేశంలో విద్యార్థుల పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మరోసారి ప్రత్యేక గుర్తింపు పొందనుంది.

వారానికి ఆరు రోజులు రుచికరమైన మెనూ

విద్యార్థులకు కేవలం కడుపు నింపే ఆహారం కాదు.. పోషక విలువలతో కూడిన రుచికరమైన అల్పాహారం అందించేందుకు ప్రత్యేక మెనూను రూపొందించారు.

*సోమవారం* - దోసె, సాంబారు లేదా చట్నీ
*మంగళవారం* - మిల్లెట్ ఇడ్లీ, సాంబారు
*బుధవారం* - పూరీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కుర్మా
*గురువారం* - బోండా, సాంబారు లేదా చట్నీ
*శుక్రవారం* - ఇడ్లీ, సాంబారు లేదా చట్నీ
*శనివారం* - ఉప్మా, సాంబారు లేదా చట్నీ

విద్యార్థుల వయసును బట్టి పరిమాణాలు కూడా నిర్ణయించారు. చిన్నారులకు 150 గ్రాములు, పెద్ద తరగతుల విద్యార్థులకు 200 గ్రాముల వరకు ఉప్మా అందించనున్నారు.

**పాలు.. రాగిజావ.. పోషకాహారానికి ప్రాధాన్యం**

అల్పాహారంతో పాటు పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారానికి మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ అందించనున్నారు. ప్రీ ప్రైమరీ నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులకు 75 మిల్లీలీటర్లు, పై తరగతుల వారికి 100 మిల్లీలీటర్ల చొప్పున అందజేస్తారు. కాల్షియం, ప్రోటీన్లు, ఐరన్ వంటి పోషకాలు సమృద్ధిగా అందేలా మెనూ రూపొందించారు.

**రూ.720 కోట్ల భారీ ప్రణాళిక**

ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. మొత్తం రూ.720 కోట్ల వ్యయంతో కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఇందులో పాల సరఫరాకు రూ.180 కోట్లు, అల్పాహారానికి రూ.540 కోట్లు ఖర్చు చేయనున్నారు. అదనంగా ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూ.56 కోట్లు కేటాయించారు.

**ఆధునిక కిచెన్ల నుంచి నేరుగా పాఠశాలలకు**

ఆహార నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ కేంద్రీకృత వంటశాలల ద్వారా అల్పాహారాన్ని సిద్ధం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 39 ప్రాంతాల్లో ఆధునిక కిచెన్ల నిర్మాణానికి రూ.299.90 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఉన్న ఏడు కిచెన్లను ఆధునీకీకరించనుండగా, మిగిలిన వాటిని కొత్తగా నిర్మించనున్నారు. ఈ నిర్మాణ బాధ్యతలను తెలంగాణ రాష్ట్ర విద్యా సంక్షేమ, మౌలిక అభివృద్ధి సంస్థ పర్యవేక్షించనుంది.

**ప్రభుత్వంతో చేతులు కలిపిన స్వచ్ఛంద సంస్థలు**

ఈ కార్యక్రమంలో ప్రభుత్వంతో పాటు ప్రముఖ స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం అవుతున్నాయి. మొత్తం వ్యయంలో 70 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుండగా, మిగిలిన 30 శాతం వ్యయాన్ని స్వచ్ఛంద సంస్థలు భరించనున్నాయి.

మేడ్చల్‌మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాల్లో మన్నా ట్రస్ట్ ద్వారా 107 పాఠశాలలు, 12 జూనియర్ కాలేజీల విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. మరోవైపు హరే కృష్ణ మూమెంట్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని 1,162 పాఠశాలలు, 21 జూనియర్ కాలేజీల విద్యార్థులు లబ్ధి పొందనున్నారు.

**జూనియర్ కాలేజీలకూ మధ్యాహ్న భోజనం**

ఇప్పటివరకు పాఠశాలలకే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు కూడా విస్తరించనున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం ద్వారా ఉన్నత విద్యలో డ్రాపౌట్లు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సుమారు 1.70 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

**ఆకలి నుంచి అభ్యాసం వరకు..**

విద్యార్థి జీవితంలో ఆకలి పెద్ద అడ్డంకి. ఆ అడ్డంకిని తొలగిస్తేనే విద్యార్థి ప్రతిభ వెలుగులోకి వస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభిస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకం కేవలం అల్పాహారం అందించే కార్యక్రమం మాత్రమే కాదు. ఇది పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించే ప్రయత్నం. ఇది విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే సంకల్పం. ఇది పాఠశాల హాజరు శాతాన్ని పెంచే వ్యూహం. ముఖ్యంగా ఆకలి నుంచి అభ్యాసం వైపు పిల్లలను నడిపించే సామాజిక పెట్టుబడి.

రేపటి నుంచి పాఠశాల ప్రాంగణాల్లో వినిపించబోయే గంట శబ్దంతో పాటు వేడి వేడి అల్పాహారం సువాసనలు కూడా విద్యార్థులను ఆహ్వానించబోతున్నాయి. తెలంగాణ విద్యా రంగంలో ఇది మరో కీలక మైలురాయిగా నిలవనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఇక ప్రభుత్వ స్కూల్ పిల్లలూ కార్పొరేట్ స్టైల్‌లో..

**మొదటిపేజీ తరువాయి**

యూనిఫాంలకు సంబంధించి వస్త్రం సరఫరా మొదలు కుట్టు పని వరకు ప్రతి దశలోనూ నాణ్యతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని రకాల పాఠశాలలు, గురుకులాల్లోని విద్యార్థులకు మఫత్‌లాల్ వంటి పేరెన్నికల గల సంస్థ నుంచి యూనిఫాం వస్త్రాన్ని ఈ దఫా సేకరిస్తున్నారు. యూనిఫాంతో పాటు స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్సులు, టై, బెల్ట్, బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా ఇలా ప్రతి దానిలోనూ ప్రభుత్వం నాణ్యతకు పెద్ద పీట వేసింది. గతంలో పాఠశాల విద్యా విభాగం, ఏ గురుకుల విభాగానికి ఆ గురుకుల విభాగం విద్యార్థులకు అవసరమయ్యే సామగ్రి వేర్వురుగా కొనుగోలు చేసి అందజేసేవి.. దాంతో అనేకరకాల హెచ్చుతగ్గులు కనిపించేవి. కొన్ని పొరపాట్లు చోటుచేసుకునేవి.. ఆ సమస్యలను అధిగమించి సామగ్రి సేకరణ.. పంపిణీలో ఏకరూపత కోసం ఈ ఏడాది ప్రభుత్వం సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ సిస్టమ్ తీసుకువచ్చింది. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పరిధి విద్యా సంస్థల విద్యార్థులకు మన్నికైన యూనిఫాం, ఇతర సామగ్రి అందజేసేందుకు రూ.687.78 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది. దీనిని ఖర్చుగా కాకుండా భవిష్యత్ తరాలపై పెట్టే వ్యయంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నాయి..

మొత్తం 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంకు సంబంధించి 2.97 కోట్ల మీటర్ల వస్త్రం కొనుగోలుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మఫత్‌లాల్ కంపెనీ 2.41 కోట్ల మీటర్లు, తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ (TGSCO) 55.32 లక్షల మీటర్ల వస్త్రం సరఫరా చేస్తున్నాయి. ఇందులో విద్యార్థినీవిద్యార్థులకు లైట్ బ్లూ, డార్క్ బ్లూ, వైట్, ప్లెయిన్ మెరూన్, మెరూన్ చెక్స్ రంగుల్లో యూనిఫాంలు అందజేయనున్నారు. విద్యార్థినులకు స్కర్ట్, పంజాబీ డ్రెస్, చున్నీ సరఫరా చేయనున్నారు. ఈ దఫా విద్యార్థులకు యూనిఫాం రంగులను ప్రభుత్వం మార్చింది. డే స్కాలర్స్‌కు టాప్ లైట్ బ్లూ, లోవర్స్ డార్క్ బ్లూ యూనిఫాంలో ఉండనున్నాయి. గురుకులాల్లోని విద్యార్థులకు టాప్‌లో మెరూన్ చెక్, లోవర్ మెరూన్ యూనిఫాంలో ఉండనున్నాయి.

యూనిఫాం కుట్టు పనిని మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం అప్పజెపింది.. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు రోజుకు 75 వేల నుంచి లక్ష యూనిఫాంలు కుట్టే సామర్థ్య ఉంది. ఒక్కో యూనిఫాం కుట్టు పనికి రాష్ట్ర ప్రభుత్వం రూ.75 చెల్లిస్తుంది. సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున యూనిఫాంలు అందించనున్నారు. ఈ పనితో సంఘాల్లోని మహిళలకు సుమారు రూ.40 కోట్లకుపైగా ఆదాయం సమకూరనుంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన సామగ్రితో కూడిన కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఇందులో యూనిఫాంతో పాటు తెల్లని బూట్లు, తెల్లని సాక్సులు ఉంటాయి. గతంలో బీసీ గురుకులాల్లోని విద్యార్థులకు మాత్రమే బూట్లు ఇచ్చేవారు. ఈ దఫా అన్ని రకాల యాజమాన్యాల్లోని విద్యార్థులకు బూట్లను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, పట్టణ గురుకుల పాఠశాలల విద్యార్థులకు బెల్టు, ఐడీ కార్డు, టై, స్కూల్ బ్యాగు, బూట్లు (నలుపు, తెలుపు - సాక్సులతో), బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా, ట్రంక్ బాక్సు, పీటీ డ్రెస్, నైట్ డ్రెస్, ట్రాక్ సూట్‌తో కూడిన సంపూర్ణమైన కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. మైనారిటీ గురుకులాల్లోని విద్యార్థులకు తొలిసారిగా ట్రాక్ సూట్, నైట్ డ్రెస్ లను రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లోని విద్యార్థులకు తొలి సారిగా నల్లటి బూట్లు, బెల్టును రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది.

ఇప్పటి వరకు ప్రభుత్వాలు పాఠశాలలకే పెద్దపీట వేశాయి. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులపైనా ప్రత్యేకంగా దృష్టిసారించింది. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూలేని విధంగా తొలిసారి ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లోని సుమారు 2 లక్షల మంది విద్యార్థులకు కాలేజీ బ్యాగు, బెల్టు, టై, నల్లటి బూట్లు, సాక్సులు అందజేయనుంది. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లోని విద్యార్థులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు ఇప్పటికే ఆయా సంస్థలకు చేరాయి. తొలి వారంలోనే వాటి పంపిణీ పూర్తి కానుంది. విద్యార్థులకు యూనిఫాంతో పాటు అందజేసే బూట్లు, సాక్సులు, టైలు, బెల్టులు, గురకుల్లాలోని విద్యార్థులకు అందజేసే దుప్పట్లు, ప్లేట్లు, గ్లాస్‌లు ప్రతి ఒక్కటి నాణ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ టెండర్లను పిలిచింది. మిగిలిన ఆర్డర్లను TGSCO, TGLIPC, తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ - TGTPC లకు రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేస్తున్నది రూ.687.78 కోట్లు మాత్రమే. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన సామగ్రి అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా జాతీయ ఈ టెండర్ల పద్ధతిని పాటిస్తోంది. ఈ విషయంలో ప్రతిపక్ష నేతలు, దురుద్దేశ్యపూరితంగా రూ.వేల కోట్ల అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉంది.

యూనిఫాం, బెడ్డింగ్ ఆర్డర్లలో 25-30% తెలంగాణ రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘానికి (TGSCO)కి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇందులో 25% యూనిఫాం వస్త్రం (సుమారు 56 లక్షల మీటర్లు), 100% దుప్పట్లు (6,49,381), 3 లక్షల బెడ్‌షీట్లు, 2.29 లక్షల కార్పెట్లు ఉన్నాయి. ఈ ఆర్డర్‌తో చేనేత కార్మికులకు ఆదాయం సమకూరనుంది. టైలు, బెల్టులు, ఐడీ కార్డుల ఆర్డర్‌ను తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ (TGLIPC)కి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ ఆర్డర్‌తో ఆ సంస్థ ఆర్థికంగా బలోపేతం కానుంది.

ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే యూనిఫాం, టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, కార్పెట్లతో యూనిఫాంలు కుట్టే మహిళలు, దుప్పట్లు, కార్పెట్లు తయారుచేసే చేనేత కార్మికులు, బెల్టులు, ఇతర సామగ్రి తయారీతో TGLIPC పరిధిలోని కార్మికులకు ఆదాయం లభిస్తుంది. గత ప్రభుత్వం హయాంలో పాఠశాల విద్యా శాఖతో పాటు ఏ గురుకుల సంస్థకు ఆ గురుకుల సంస్థ యూనిఫాంతో పాటు ఇతర సామగ్రి తయారీ సేకరణ, పంపిణీ చేపట్టేవి. ఇందులో ఏకరూపత లేకపోవడంతో అనేక అవకతవకలు చోటు చేసుకునేవి. ఈ వస్తువుల సరఫరాలో పాతుకుపోయిన కొన్ని ముఠాలు నాసిరకమైన వస్త్రం, ఇతర సామగ్రి పంపిణీ చేసి భారీగా దండుకునేవి. పైగా ఆ నాసిరకం సామగ్రి పంపిణీ ఏడాదిపొడవునా సాగేది. ఆ అవకతవలన్నింటికి అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది తొలిసారిగా సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టింది. దీంతో అన్ని రకాల యాజమాన్యాల్లోని విద్యార్థులకు ఏకకాలంలో యూనిఫాంలు, కిట్లు, ఇతర సామగ్రి అందనున్నాయి.

# రేవంత్ పాలన అట్టర్ ఫ్లాప్

**మొదటిపేజీ తరువాయి**

కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి 1తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌తో పాటు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.


ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే వాటిలో చాలా వరకు ఇంకా అమలు కాలేదని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, వృద్ధులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో వేలాది మంది పేదల ఇళ్లను కూల్చివేసిందని ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ప్రజల ఆవేదనను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. పేదల జీవనోపాధిపై ప్రభావం చూపే చర్యలను ప్రభుత్వం పునరాలోచించాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపైనా కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా ఉన్న మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచింది కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డేనని ఆరోపించారు. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు పెరుగుతున్నాయని, వాటి ప్రభావం పాలనపై పడుతోందని విమర్శించారు.

ఖైరతాబాద్ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై కూడా కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉపఎన్నిక వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఆ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలని, బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.



# సింగరేణిపై దుష్ప్రచారం మానాలి

**మొదటిపేజీ తరువాయి**

ఆరోపణలు తన మనసును కలచివేశాయని, అందుకే ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే ఉద్దేశంతో ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు.

రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ భవిష్యత్తుకు వెన్నెముకగా ఉన్న సింగరేణి సంస్థను అపహాస్యం చేయవద్దని సూచించారు. గనుల నుంచి వెలికితీసిన బొగ్గును గ్రేడ్‌ల వారీగా నిల్వ చేస్తామని, ఆ నిల్వలన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు అవుతాయని వివరించారు. బొగ్గు తరలించే ప్రతి వాహనానికి జీపీఎస్ వ్యవస్థ అమర్చినట్లు, విజిలెన్స్ విభాగం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. కిలో బొగ్గు కూడా అక్రమంగా బయటకు వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు.

అనంతరం మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ బీఎల్ఏల సమావేశంలో పాల్గొన్న భట్టి విక్రమార్క, ఎస్ఐఆర్ ప్రక్రియపై తీవ్ర విమర్శలు చేశారు. ఎస్ఐఆర్‌ను అడ్డంపెట్టుకుని అసలైన ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఓటు హక్కు కోల్పోతే పౌరసత్వానికే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే ఓటర్లను ఏఐ టెక్నాలజీ ద్వారా గుర్తించి జాబితాలు తయారు చేస్తున్నారని, వారి పేర్లను హోల్డ్‌లో పెడుతున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకులు పథకం ప్రకారమే ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు గ్రామాల్లో విస్తృత ప్రచారం ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ఓటర్ల మ్యాపింగ్ సక్రమంగా జరగలేదని, దాదాపు 80 వేల మంది ఓటర్లు అన్‌మ్యాపింగ్ అయ్యారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సింగరేణిపై కొందరు నిరంతరం అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పదేపదే అబద్ధాలు చెబుతూ గత తప్పులను కప్పిపుచ్చుకోలేరని అన్నారు. సింగరేణి సంస్థ ప్రయోజనాలను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, సింగరేణిని రక్షించేది కాంగ్రెస్ మాత్రమేనని స్పష్టం చేశారు.

# హైదరాబాద్ లో గొంతెత్తిన కాక్రోచ్ జనతా పార్టీ

**మొదటిపేజీ తరువాయి**

ప్రస్తావించిన నిరసనకారులు, విద్యా వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ఘటనలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

సభను ఉద్దేశించి మాట్లాడిన ఆకునూరి మురళి కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో అపారమైన సంపద ఉన్నప్పటికీ యువతకు ఉపాధి అవకాశాలు ఎందుకు కల్పించలేకపోతున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో యువత ఆవేదనను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

"దేశంలో ఆరు శాతం మంది యువతకు మాత్రమే తగిన నైపుణ్యాలు ఉన్నాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. మిగతా యువతకు నైపుణ్యాలు అందించే వ్యవస్థ ఎందుకు అభివృద్ధి కాలేదు? విద్య, ఉపాధి రంగాల్లో ప్రభుత్వ వైఫల్యాల కారణంగా యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది" అని ఆయన అన్నారు.

యువతను 'కాక్రోచ్‌లు'గా అభివర్ణించడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని పేర్కొన్న ఆయన, విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను సహించబోమన్నారు. నీట్ లీకేజీ వ్యవహారంలో లక్షలాది మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే కాకుండా, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు.

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న యువత, విద్యార్థి సంఘాల ప్రతినిధులు విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



# మా మంత్రులు, ఎంపీలే అన్ని చేస్తే.. ఇక సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు?

**మొదటిపేజీ తరువాయి**

చేస్తోందన్నారు.

రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకుని ప్రచారం చేసుకుంటోందని రామచందర్ రావు విమర్శించారు. ధాన్యం కొనుగోలు చేయాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను సీఎం రేవంత్ రెడ్డి కోరుతున్నారని.. అన్ని పనులు కేంద్ర మంత్రులు, ఎంపీలు చేస్తే ముఖ్యమంత్రి పదవిలో మీరు ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఒక్కరోజు వర్షం పడితేనే నగరం అతలాకుతలమైందన్నారు. ఈ పరిస్థితికి మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని, వెంటనే ఆ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు.

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై కూడా రామచందర్ రావు విమర్శలు చేశారు. ఫ్యూచర్ సిటీలో రేవంత్ రెడ్డికి రాజకీయ భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు. రాబోయే మూడు మున్సిపాలిటీల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న ప్రేమ బంధం ఇప్పుడు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ రెండు పార్టీలకు మధ్యవర్తిగా ఎంఐఎం వ్యవహరిస్తోందని, ఈ మూడు పార్టీలు కలిసి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజాసేవ కోసం కాకుండా కమిషన్ల కోసం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి వద్ద అనేక శాఖలు, మంత్రి పదవుల బాధ్యతలు ఎందుకు ఉన్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఏమి చేసిందనే అంశంపై సచివాలయం గేట్ ముందు బహిరంగ చర్చకు సిద్ధమని రామచందర్ రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి ముందుగా హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల అభివృద్ధి గురించి మాట్లాడాలని.. ఆ తర్వాత ఫ్యూచర్ సిటీ గురించి మాట్లాడాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా ప్రచార రాజకీయాలు చేస్తున్నారని రామచందర్ రావు విమర్శించారు.

# దమ్ముంటే శాసనసభ రద్దు చేయ్

**మొదటిపేజీ తరువాయి**

పదవికి రాజీనామా చేసి, శాసనసభను రద్దు చేసి తక్షణమే ఎన్నికలకు రావాలని డిమాండ్ చేశారు. కావాలంటే కాంగ్రెస్‌కు ఉన్న ఎనిమిది మంది ఎంపీలను అలాగే ఉంచుకోవచ్చని, ప్రజా క్షేత్రంలో ఎవరు గెలుస్తారో తేల్చుకుందామని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి పదవికి తాము ఇస్తున్న గౌరవాన్ని, తమ సంస్కారాన్ని చేతకానితనంగా భావించవద్దని ఆయన హెచ్చరించారు.

రాజకీయంగా తాము కూడా అంతే ధీటుగా స్పందించగలమని స్పష్టం చేస్తూ, "కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముందు వడ్లు పోస్తామని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం సరికాదని, అలాగైతే తమకు కూడా కొడంగల్‌లో లేదా ప్రగతి భవన్ (మహాత్మా



జ్యోతిబాపూలే ప్రజా భవన్) ముందు వడ్లు పోయడం రాదా?" అని రఘునందన్ రావు నిలదీశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి కక్షసాధింపు చర్యలు, సవాళ్లు పక్కనపెట్టి రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కూటమి, కేంద్రంపై అనవసర విమర్శలు చేయడం ఆపి, దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేసి ప్రజా తీర్పును కోరాలని ఆయన స్పష్టం చేశారు.




# నూతన పోలీస్ స్టేషన్ల స్వంత భవనాలకు స్థలాల పరిశీలన.

- **పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి అనువైన స్థలాలపై సమగ్ర నివేదిక సమర్పించాలి.**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.**

**డిడి9వార్త / పెద్దపల్లి జూన్ 15:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపల్లి నియోజకవర్గంలో నూతనంగా మంజూరు చేసిన ఎలిగేడు పోలీస్ స్టేషన్, పెద్దపల్లి మహిళా, రూరల్ మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు సొంత భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష , రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తో కలిసి పరిశీలించిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ... ప్రజలకు మరింత మెరుగైన భద్రతా సేవలు అందించేందుకు నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు అవసరమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నడూ లేని విధంగా పెద్దపల్లి నియోజకవర్గంలో ఏకకాలంలో నాలుగు నూతన పోలీస్ స్టేషన్లు మంజూరు చేయడం గర్వకారణమని ఆ పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి సంబంధించి అనువైన స్థలాల ఎంపికపై సమగ్ర నివేదికను సోమవారం సాయంత్రం లోపు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు ద్వారా ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువవుతాయని, శాంతిభద్రతల పరిరక్షణలో ఇది కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, కౌన్సిలర్లు మరియు పలు గ్రామాల సర్పంచ్లు మరియు పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# మేడారం ప్రజల సమస్యలను పట్టించుకునే అధికారులు లేరా?

- **సమ్మక్క సారలమ్మ మేడారం తాడ్వాయి మండలం మేడారం గద్దెల ముందు వాహనాలు**
- **నిలిచి ఉండడంవల్ల భక్తులకు చాల అంతరాయం**
- **గద్దెల ముందుఆటోలు ,కారులు , టూ వీలర్స్ ,పులబండ్లు తోసేబండ్లు ,ఆగం ఆగంగా ఉంటున్నాయి**

**ములుగు జిల్లా తాడ్వాయి మండలం (DD9 వార్త) జూన్ 14**





తాడ్వాయి మండలం మేడారం ప్రాంగణంలో గద్దెల ముందుగానీ జనాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి పూజారులు ఎండోమెంట్ వాళ్ళు పోలీస్ శాఖ వాళ్ళు ఇరువైపులా జనాలను గమనించండి పంచాంగం చెప్పే వాళ్ళు ఎక్కువైపోయారు సోది చెప్పేవాళ్లు వాళ్ల వల్ల జనాలకు ఇబ్బంది కలుగుతుంది జాతరకు వచ్చిన వాళ్లకు ఎటుపోవాలో తెలియకుండా అర్థం కావడం లేదు అందుకే చిన్నపిల్లలు కానీ పెద్ద పిల్లలు గాని పెద్దవాళ్లు గాని ఎటువైపు పోవాలో అర్థం కాని పరిస్థితి సెంటర్లో బోర్డులు ఏర్పాటు చేయండి ప్రజలకు అవగాహన కల్పించండి అక్కడక్కడ గుర్తులు చూచిక బోర్డు పెట్టండి ఎక్కువగా ఎండోమెంట్ వాళ్ళు పెద్దప్రత్యేక దృష్టి పెట్టండి ఆడవాళ్లకు ముఖ్యంగా లెట్ రూమ్ కు పోవాలంటే బయటికి చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది చిన్న అమ్మాయిలకు పెద్దమ్మాయిలకు యువకులు పెద్దమనుషులు వయసులో పెద్దవారైనా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు మేడారం జాతరకు కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు కానీ జాతరకు వచ్చే భక్తుల గురించి ఆలోచన చేయడం లేదు ప్రభుత్వం అధికారులు పట్టి పట్టనట్టు చూసి చూడనట్టు అధికారులు ఉంటున్నారు కొన్ని కోట్లు డబ్బులు ఎటు పోతున్నాయి ఏమైనాయి అధికారులకు రాజకీయ నాయకులకు ప్రభుత్వానికి ప్రజల సమస్యలపై గుర్తుకు రావడం లేదా కొన్ని సంవత్సరాలైనా లెట్ రూమ్స్ ఇంతవరకు గతి లేవు సరైన వసతులు లేవు ఎందుకంటే ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించి ఆలోచన చేయండి మేడారం ప్రపంచంలోనే అతిపెద్ద జాతర జరుగుతుంది ఇంతవరకు సౌకర్యాలు లేవు రాజకీయ నాయకులకు అధికారులకు ప్రజల సమస్యలు కనబడడం లేదా వినబడడం లేదా చూడడం లేదా ఎండోమెంట్ వాళ్లకు లెట్ రూమ్స్ ఉన్నాయి అధికారులకు లెట్ రూమ్స్ ఉన్నాయి వచ్చిపోయే భక్తులకు లేటు రూమ్స్ లేవు వాళ్ళు ఎటు పోవాలి? ప్రజల సమస్యలు వచ్చిపోయే జాతర భక్తులకు సమస్యలు అధికారులకు గుర్తు రావు మేడారం జాతరకు భక్తుల నుండి ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదా భక్తుల గురించి ఎందుకింత నిర్లక్ష్యం చేస్తుంది ఈ విషయాలపై ప్రభుత్వం ఇకనుండి అధికారులు రాజకీయ నాయకులు ప్రజల సమస్యలపై స్పందించండి జాతరకు వచ్చే భక్తుల గురించి అంతరాయం కలగకుండా వాహనాలను క్లియర్ చేయండి అని మేడారం గుడి ముందు లోకల్ స్థానిక ప్రజలు భక్తులు ఆవేదన బాధలు ఎవరికి చెప్పుకోవాలి అని చర్చించుకుంటున్నారు

## భక్తి సాహిత్యానికి 'మన్నె శ్రీ భజన కీర్తనలు–II'
# మరో చిరస్మరణీయ కానుక

- **కిస్మత్‌పూర్‌లో ఘనంగా గ్రంథావిష్కరణ**
- **భజన సంప్రదాయాలను భావితరాలకు అందించే విలువైన రచన:వక్తలు**

**రాజేంద్రనగర్,జూన్ 14 డిడి 9**

తెలుగు భక్తి సాహిత్యాన్ని మరింత సుసంపన్నం చేసే దిశగా నంది పురస్కార గ్రహీత,ప్రముఖ రచయిత మన్నె మహాత్మరావు (మన్నెశ్రీ)రచించిన'మన్నెశ్రీ భజన కీర్తనలు-II'గ్రంథాన్ని ఆదివారం కిస్మత్‌పూర్ హనుమాన్ దేవాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. భక్తి,సాహిత్య,ఆధ్యాత్మిక విలువల సమ్మేళనంగా జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు,సాహిత్యాభిమానులు,సామాజిక ప్రముఖులు విశేషంగా హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకోగా,అనంతరం జరిగిన గ్రంథావిష్కరణ సభలో పలువురు వక్తలు మన్నెశ్రీ సాహిత్య సేవలను కొనియాడారు. ముఖ్య ఆహ్వానితులుగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ..భక్తి సాహిత్యం సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మన్నెశ్రీ రచనలు భక్తి మార్గంలో నడిచే వారికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

పుస్తక ప్రచురణకర్త నీరుడు శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ భజన సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఈ గ్రంథాన్ని ప్రచురించినట్లు తెలిపారు. భక్తి సాహిత్యాన్ని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని,ఇటువంటి గ్రంథాలు తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు,భజన బృందాల సభ్యులు, సామాజిక ప్రముఖులు పాల్గొని రచయిత మన్నెశ్రీని ఘనంగా సన్మానించారు. భక్తి, సాహిత్యం,సంస్కృతికి అంకితమైన ఈ గ్రంథం భజన బృందాలు,యువతతో పాటు భక్తి సాహిత్యాభిమానులకు ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.






# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై వివరణ

**బోనకల్,జూన్14,(డీడీ9 వార్త):**

మండల కేంద్రంలో సిపిఎం కార్యాలయం వద్ద ఆదివారం స్టడీ సర్కిల్ కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షతన స్టడీ సర్కిల్ నిర్వహించడం జరిగింది.ఈ స్టడీ సర్కిల్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనే విషయంపై సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బషీరుద్దీన్ మాట్లాడుతూ జూన్ 25వ తేదీ నుండి వచ్చే నెల 24వ తేదీ వరకు ఓటర్ల సమగ్ర సర్వే నిర్వహిస్తారని, ఆ సర్వేను బిఎల్ఏ లు చాలా జాగ్రత్తగా పర్యవేక్షించాలని లేనిపక్షంలో అర్హత ఉన్న వారి ఓట్లు కూడా గల్లంతయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు, అందుకే ప్రతి బిఎల్ఎ సర్ పై పూర్తి అవగాహనతో ఉండాలని సర్ గురించి సమగ్ర వివరణ ఇచ్చారు.ఈ స్టడీ సర్కిల్ కి పార్టీ నియమించిన బిఎల్ఏ లు,మండల కమిటీ సభ్యులు,శాఖా కార్యదర్శులు,శాఖ సభ్యులు తదితరులు హాజరయ్యారు.



# బీరోలు గ్రామంలో గిరిజన మహిళపై దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలి. మాస్ లైన్ ప్రజాపంథా డిమాండ్

**తిరుమలాయపాలెం,జూన్ 14 ,డి డి 9 వార్త**

తిరుమలాయపాలెం మండలంలోని వారం రోజుల క్రితం,మండల పరిధిలోని,బీరోలు గ్రామానికి చెందిన,పేరం రత్తమ్మ అనే గిరిజన (ఎరుకలి) మహిళను ఏ కారణం లేకుండా దాడి చేసి కుడి చేయి విరగ్గొట్టిన బోళ్ల సంధ్య, గణేష్, లలిత, లక్ష్మయ్య, కిరణ్, ఫుల్ గుజ్జు సుమంత్, భద్రమ్మల పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ( ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు. గుండమల రామయ్య. పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య. ఏఐపీకేఎంఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధిత పేరం రత్తమ్మని పరామర్శించి ఖండించినారు. ఆమెకి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లతో మాట్లాడి ఆమెపై దాడి చేసిన పై వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని గిరిజన మహిళలకు భద్రత కల్పించాల్సిందిగా కోరారు. రత్తమ్మ భర్త హరినాథ్ సిపిఐ ఎంఎల్ (ప్రజాపంద) ఏర్పాటు చేయడంలో బీరోలు గ్రామంలో ఆనాటి నాయకులు దారమళ్ళ ముత్తయ్య, పేరం దశరథ, కోదండం,పట్టాభి అమరులు పూసలి నారాయణ, సోమన బోయిన సోమయ్య లతో కలిసి దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన కుటుంబంపై అకారణంగా దాడి చేయటానికి సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తీవ్రంగా ఖండిస్తూ ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని వారు మాట్లాడు, తెలిపారు.





# గోపా గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ పెద్దపల్లి శాఖ ఆధ్వర్యంలో సన్మానం.

- **2026 సంవత్సరంలో పదవ తరగతి 100 మంది స్టూడెంట్లకు సన్మాన కార్యక్రమం.**

**డిడి9వార్త / రామగుండం జూన్ 15:**

ఈరోజు స్థానిక సాయి లీల రెసిడెన్సి లో గోపా గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ పెద్దపల్లి శాఖ ఆధ్వర్యంలో 2026 సంవత్సరంలో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు 500 పైగా సాధించిన సుమారు 100 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కార్ అవార్డుల ప్రధానోత్సవం ఇదే కార్యక్రమంలో నూతనంగా ఎన్నికోబడిన గౌడ ప్రజాప్రతినిధులను రామగుండం నుండి బాలసాని తిరుపతి గౌడ్ ని మంథని మునిసిపల్ నుండి మాచిడి రాజు గౌడ్ ని సన్మానించడం జరిగింది. ఇందులో భాగంగా మొదటగా టాప్ ఐదుగురికి 589 585 583 583 576 571 మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నగదు పురస్కారం కూడా అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ శ్రీనివాస్ గౌడ్ ఉపాధ్యక్షులు ముద్దగొని రామ్మోహన్ గౌడ్ బత్తిని సత్యనారాయణ గౌడ్ వీరయ్య గౌడ్ రాష్ట్ర నాయకులు అమరగోని నరసయ్య గౌడ్ పెద్దంపేట్ శంకర్ గౌడ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మంద రమేష్ గౌడ్ ప్రధాన కార్యదర్శి బందారపు యాదగిరి గౌడ్ కోశాధికారి కొక్కిసా దేవేందర్ గౌడ్ ఉపాధ్యక్షులు బాలసాని స్వామి గౌడ్ గాదర్ల కొమరయ్య గౌడ్ ముక్కెర రాజయ్య గౌడ్ తిరుమల సురేందర్ గౌడ్, మాచిడి మహేందర్ గౌడ్ తదితర గోపా బాధ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# లోన్ ఇప్పిస్తామని భార్యభర్తలను మోసం చేసిన సైబర్ నేరస్తుడు

**భద్రాచలం, జూన్ 14 , డిడి9 వార్త**

భద్రాచలంలోని భగవాన్‌దాస్ కాలనీకి చెందిన భార్య, భర్తలను లోన్ ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసి రూ.52 వేలు కాజేసిన ఘటనపై భద్రాచలం సీఐ నాగరాజుకు అందిన ఫిర్యాదు మేరకు కేసు మోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మానసనరసింహారావు దంపతులకు లోను అవసరం ఉండటంతో పాటు ఫేస్బుక్‌లో రిలయన్స్ లోన్ సర్వీసు ఉన్న లింక్‌ను సంప్రదించారు. ఈ సమయంలో సదరు వ్యక్తి మీ భార్య పేరుతో రూ.15 లక్షలు లోన్ వచ్చే అవకాశం ఉందని, అందుకు సంబంధించి ప్రాసెసింగ్ ఫీజు, ట్యాక్స్ , ఇన్సూరెన్సు కింద రూ.52 వేలు ముందుగా చెల్లించాలని కోరారు. దీంతో వారు ఏప్రిల్ 10 నుంచి 14వ తేదీ మధ్యలో విడతలవారీగా రూ.52 వేలు అతని ఫోన్‌కు పంపారు. అనంతరం వీరు ఎన్నిసార్లు సంప్రదించినా ఆ నెంబరుకు ఎన్నిసార్లు ఫోను చేసినా ఎటువంటి సమాధానం రాకపోవడంతో తాము మోసపోయామని గ్రహించి 1930 సైబర్‌సెల్‌కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పారు. అలాగే శనివారం రాత్రి భద్రాచలం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీంతో సీఐ నాగరాజు సైబర్‌నేరంగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vaartha
సోమవారం
15-06-2026
హైదరాబాద్

# తెలంగాణ సంస్కృతిక సారథి కార్పొరేషన్ చైర్పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్ నిశాలువా నాగలితో సత్కారం.

- **జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ ఆధ్వర్యంలో.**

**డిడి9వార్త / పెద్దపల్లి జూన్ 15:**

పెద్దపల్లి పట్టణంలోని కునారం రోడ్డు లోని జక్కుల రాజేశం పటేల్ నివాసంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆకుల స్వామి వివేక్ పటేల్ని మర్యాదపూర్వకంగా కలిశారు.


ఈ సందర్భంగా ఆకుల స్వామి వివేక్ పటేల్ ,గద్దర్ కుటుంబంతో తనకు ఉన్నటువంటి సన్నిహిత సందర్భాన్ని ఈ సందర్భంగా పంచుకున్నారు.తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక సారథి కార్పొరేషన్ చైర్పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్ ని శాలువా మరియు నాగలితో సత్కరించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్,ఆకుల స్వామి వివేక్ పటేల్,జక్కుల రాజేశం పటేల్, తదితరులు ఉన్నారు.



# ధర్మారం చెరుకూరు రోడ్డు నిర్మాణం త్వరగా చేపట్టాలి: ప్రజా పోరాట సమితి

**వాజేడు జూన్ 14 (డిడి9 వార్త):**

ములుగు జిల్లా వాజేడు మండలంలోని ధర్మారం చెరుకూరు రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని ప్రజా పోరాట సమితి అధ్యక్షుడు ముత్తేబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ములుగు జిల్లా మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఈ రోడ్డు నిర్మాణం పట్ల చొరవ తీసుకోవాలని కోరారు. రోడ్డు నిర్మాణం పేరుతో అటవీ అనుమతుల విషయంలో కాలయాపన జరుగుతోందని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రజాప్రతినిధుల వైఖరికి నిరసనగా ఈరోజు సోమవారం ములుగు కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు ముత్తేబోయిన మహేందర్ తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రహదారులు మరియు భవనములు శాఖ

శ్రీ బి.శ్యాం సింగ్, బి.ఇ., కార్యనిర్వాహక ఇంజనీర్, జిల్లా (ర.భ) అధికారి కార్యాలయం, జిల్లా : ములుగు

శ్రీ జి. చంద్రశేఖర్ మరియు ధర్మవరం గ్రామ ప్రజలు వాజేడు మండలము, ములుగు జిల్లా

లేఖ.నెం.డి.బి/ ఎ.ఇ.ఇ/ర & భ/ డివిజన్/ములుగు/2026-27, 30 తేదీ: 16.04.2026

విషయము:- రహదారులు మరియు భవనముల శాఖ – చెరుకూరు నుండి ధర్మవరం వరకు సుమారు 5 కి.మీ రోడ్డు విస్తరణ చేయుటకు - గురించి.

నిర్దేశము:- మీ యొక్క అర్జీ ప్రజాదర్బార్ సందర్భముగా - గౌరవనీయ శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క) పంచాయతి రాజ్, గ్రామీణ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ మాత్యులు వారికి సమర్పించిన తేది : 10.04.2026.

0o0o0o

పై సందర్భమును అనుసరించి మీకు తెలియజేయునది ఏమనగా చెరుకూరు నుండి పేరూరు వయా ధర్మవరం 9.20 కి.మీ LWE Phase-II కింద రోడ్డు మంజూరు అయినది. ఇందులో చెరుకూరు గ్రాముము చివరి వరకు ధర్మవరం నుండి పేరూరు వరకు మొత్తం 6.00 కి.మీ వరకు రెవెన్యూ భాగంలో ఉన్నది-కావున అట్టి పనిని పూర్తి చేసినాము. మిగిలిన 3.00 కి.మీ చెరుకూరు గ్రామము చివరి నుండి ధర్మవరం వరకు అటవీశాఖ పరిధిలో ఉండడం వలన అటవీశాఖ అనుమతులు లేకపోవడం వలన అట్టి పని ప్రారంభించలేదు. ఇందుకు సంబంధించి మా ప్రధాన ఇంజనీర్, హైదరాబాద్ ద్వారా ప్రభుత్వానికి అటవీ శాఖకు సుమారు రూ॥ 47,50,000.00 (నలభై ఏడు లక్షల యాభై వెయ్యిలు) చెల్లించడానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. అట్టి రుసుము ప్రభుత్వం నుండి మంజూరు అయిన పిదప అటవీశాఖకు చెల్లించి మరియు అటవీశాఖ అనుమతులు ఇచ్చిన పిదప మిగిలిన 3.00 కి.మీ పని చేయగలమని తెలియపరచానైనది.

భవదీయుడు
కార్యనిర్వాహక ఇంజనీర్,
జిల్లా (ర.భ) అధికారి,
జిల్లా: ములుగు

దీని యొక్క ప్రతిని శ్రీయుత జిల్లా కలెక్టర్, ములుగు గారికి తగు సమాచారము నిమిత్తము సమర్పించనైనది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు నిరసన వ్యక్తం చేస్తే "నిరసనలు చేయడం సరికాదు" అని బాధ్యతగల ప్రజాప్రతినిధులు వ్యాఖ్యానించడం తగదని విమర్శించారు. ప్రజా రవాణాకు ఉపయోగపడే రహదారి నిర్మాణం విషయంలో కొన్ని రాజకీయ పార్టీలు రాజకీయాలు చేయడం కూడా సమంజసం కాదన్నారు.

ఈ ప్రాంతాన్ని అన్ని రాజకీయ పార్టీలు పాలించాయని, ప్రజలు అన్ని పార్టీలను ఆదరించారని గుర్తు చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయాలకు అతీతంగా అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

కొంతమంది ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖకు రూ.2-3 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పడం సరికాదని ఆయన అన్నారు. ప్రధాన ఇంజనీర్ హైదరాబాద్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల ప్రకారం చెరుకూరు ధర్మారం రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖకు రూ.47,50,000 చెల్లిస్తే అనుమతులు లభించి రోడ్డు నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ విషయాలు ప్రజాప్రతినిధులకు తెలియదా? లేక మర్చిపోయారా? అని ప్రశ్నించారు. ఈరోజు సోమవారం ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో రోడ్డు నిర్మాణానికి సంబంధించి గ్రామ పంచాయతీలు చేసిన తీర్మానాల కాపీలను అధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలకతీతంగా ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# డ్రైవర్ మృతితో ట్రావెల్స్ కార్యాలయం ఎదుట ఆందోళన

- **కుటుంబాన్ని ఆదుకోవాలని మృతదేహంతో ధర్నా**

**భద్రాచలం, జూన్ 14 డిడి9 వార్త**

అశ్వాపురం మండలం బీజీకొత్తూరు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రయివేటు ట్రావెల్స్ డ్రైవర్ మల్లెల సత్యసాయి కుటుంబ సభ్యులు ఆదివారం భద్రాచలంలో ఆందోళనకు దిగారు. విధి నిర్వహణలో భాగంగా మణుగూరు రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా సత్యసాయి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో, ట్రావెల్స్ యాజమాన్యమే తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కునవరం రోడ్డులోని ఆ సంస్థ కార్యాలయం ఎదుట మృతదేహాన్ని ఉంచి ధర్నా నిర్వహించారు.

**దిక్కుతోచని స్థితిలో బాధిత కుటుంబం**

సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ నిరసనతో రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. తమకు ఆధారాన్ని కోల్పోయి, భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని సత్యసాయి భార్య, పిల్లలు రోదిస్తున్న తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఆవేదనను చూసి తోటి డ్రైవర్లు, స్థానికులు మద్దతు తెలిపారు.

**పోలీసుల మధ్యవర్తిత్వం**

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, ఆందోళనకారులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. యాజమాన్యంతో చర్చలు జరిపారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడే ప్రమాదం జరిగిందని, కాబట్టి సంస్థే బాధ్యత వహించాలని కుటుంబ సభ్యులు పట్టుబట్టారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించడంతో, అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు అక్కడి నుంచి తరలించారు.



# ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి మహాప్రభో.

- **తలదాచుకునేందుకు నీడ లేదు.**
- **గాలులు వీస్తే ఉన్న నీడ కూడ కొట్టుకుపోయే పరిస్థితి.**
- **ఆ వృద్ధ దంపతులను ఆదుకునేది ఎవరు.?**
- **ప్రభుత్వాన్ని ఆ వృద్ధ దంపతులు వేడుక.**

**డిడి9వార్త / తాడ్వాయి జూన్ 15:**

కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల్ ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన ఇరుమ లక్ష్మిరాజయ్య ఆ వృద్ధ దంపతులకు బతుకుచిత్రం చూస్తే ఎవరికైనా కన్నీళ్లు ఆగవు. అది ఇల్లు కాదు మూడు కర్రల మధ్యన కట్టిన ప్లాస్టిక్ తాటిపత్రి కాస్త గట్టిగా గాలి వీచిన ఎగిరిపోయే ఆ ప్లాస్టిక్ కవర్ కిందే ఆ వృద్ధా దంపతులు ప్రపంచ నడుస్తుంది. ఒకవైపు కడు పేదరికం. మరోవైపు రోగాలమయమైన వృద్ధాప్యం వెంటాడుతున్న. తల దాచుకోవడానికి కనీసం ఒక చిన్న గూడు కూడా లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలి తీర్చే బడి. బడి ఆవరణను ఊడుస్తూ. వయస్సు పై పడటంతో వీరికి కూలి పన్నులు చేసే ఓపిక లేదు. వీరికి తోడుగా ఒక మనవరాలు ఉంది. ఆ పాప బాధ్యత కూడా ఈ వృద్ధుల పైనే పడింది. ఆ గ్రామంలోని ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజనమే ఈ వృద్ధ దంపతులకు ఆకలి తీరుస్తుంది. ప్రతిరోజు ఉదయాన్నే లేచి ఆ బడి ఆవరణను ఊడుస్తూ కాలం గడుపుతున్నారు. సొంతగా ఒక చిన్న గూడు కట్టుకోవాలని ఉన్న రూపాయి తీసి రూపాయి పెట్టి సోమత వీరికి లేదు. అందుకే ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తారేమో అని వారి ఆశగా కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తే ఎలాగో డబ్బులు వస్తాయి ఆ వచ్చే డబ్బులను నమ్ముకొని. ఎవరైనా పెద్దమనసున్న దాతలు ముందుకు వచ్చి ఒక్క రూపాయి అయినా సాయం చేయకపోతారా? ముందుకు వచ్చి మాకు ఒక చిన్న గది అయినా కట్టించి ఇవ్వకపోతారా. అనే ఆశ ఆ వృద్ధ దంపతులను ప్రతిక్షణం వెంటాడుతోంది ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయిస్తే ఆ డబ్బులతో ఎవరైనా పుణ్యాత్ములు ముందుకొచ్చి ఆ వచ్చే నిధులతో మాకు ఒక గది అయినా పూర్తి చేసి ఇస్తే. ఈ తాటిపత్రి నరకం నుంచి బయటపడి ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటాం అంటూ ఆ వృద్ధులు కన్నీళ్ళతో వేడుకుంటున్నారు.







# ఐటిడీ ఏ ద్వారా ఆదివాసీ గూడెంల ప్రగతేది,,,?!!

- **ఆదివాసిగూడెంలు అడ్డగో లేనా,,,**
- **ఐ టి డి ఏ ఉన్నప్పటికి అభివృద్ధి ఊసెలేదు,,,**
- **వ్యవసాయం కుంటుబడె,రోడ్లేవి,బోర్లకు కరెంటేది,అలొలక్షనె**
- **కొత్త పీ ఓ పై ఆశలు పెట్టుకునె కాని సారొచ్చి నెలలు గడిసె,,**
- **పరిస్కారం లేని గ్రీవెన్స్ దరఖాస్తులు,,ఆశలు అడివాశలాయె**
- **పీ ఓ గిరిజన గూడెంలను సందర్శిస్తెనె ఏమైన పరిస్కారం,,,**
- **ఖాలీపోస్టుల భర్తీ ఆటకెక్కింది ఉన్న అధికారులు దేశముదుర్లుగ మారె,,**

**ఏటూరునాగారం క్రైం,డి డి 9 వార్త జూన్ 14,**

ఏజెన్సీలోని ఆదివాసీ గూడెంలు అడ్డగోలేనా,,? ప్రశ్నార్థకం గా మారిందనె విమర్శలు వస్తున్నాయి గిరిజనసంఘాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి,15 ఏండ్లుగ గిరిజనులు ఇచ్చిన ఫైలుకదల్లేదు, పి ఓ దృష్టికి రావడం లేదు వస్తె చూస్తం మేడమ్ ఆమె ఏమి అనలేక ఓయారు ఆమె పోయక ఏడాది కాలం ఐటిడి ఏ ఎండమావిగ మారింది కలెక్టర్ దివాకర్ టి ఎస్ వచ్చినప్పెడె భయపడేది ఆ తర్వాత మామూలుగ ఉండెది, గిరిజనగూడెంలొ తాగునీరు, వ్యవసాయం, రుణాలు బయటి బ్యాంకులె జి సి సి రుణాలు నిలిపివేశారు, ఆఫీసు నుంచి ఏ ఒక్క అర్జీకూడ పరిస్కారం కాలేదు జిరిజనులు ఆశలు అడవాశలుగా మారాయి,

**కొత్తపీ.ఓ పైనె గిరిజనుల ఆశలు,,,!!**

ఐటిడీ ఏ కు కొత్తగా వచ్చిన పీ ఓ పై నె గిరిజనులు ఆశలు పెట్టుకున్నారు, సమస్యలను పట్టించుకుని అభివృద్ధి చేస్తారని కళలు కంటున్నారు పీ ఓ వచ్చి మూడు నెలలు దాటెను కాని ఏ గ్రామం సందర్శించలేదు ఎందుకో మరి మా గూడెంలలొ ఉన్నసమస్యలు ఏవిధంగా తెలుస్తాయె అని ఎదురుచూస్తున్నారు గూడెంలను పీ ఒ సందర్శిస్తె నె అక్కడ నెలకున్న సమస్యలు తెలిసేది తాడ్వాయికి సమీపంలొ లవాలగ్రామం ఉంది శతాబ్దాల కాలంగా ఈ గ్రామానికి రోడ్డులెదు ఏసారు కూడ పట్టించుకున్నదాఖలాలు లేవు,,ఇదేమండలం నర్సాపురం ఉంది పక్కనె జీవనదిగ ప్రవహించె వాగుంది సాగునీరు పొలాలకు పారకం లేక వృథాగా పొతుంది కలెక్టర్,సీతక్క, అధికారులు అంతా ఈవాగును చూస్తుపోతారు సాగునీరు లేకమక్కజొన్నలు పండిస్తున్నారు, మరికొన్ని భూములు సాగుకోల్పోయె ను,ఇలాంటిగ్రామాలు అనేకం ఉన్నాయి

**లింగాల,బందాలవైపు అభి వృద్ధింటెనె తెలవదు,,!!**

ఇదేమండలం దూరంగా అడవులు, గుట్టల్లొ ఉంటున్న లింగాల,బందాల,పొచాపురం వైపున అభివృద్ధంటెనె తెలవదు,పంటల సాగులేదు మక్కలసాగునె వెస్తున్నారు ఐటిడి ఏ ఫలాలు ఏమితెలవదు అట్లా ఉంది పరిస్థితి, ఒకసారి పీ ఒ గ ఈగ్రామాలను సందర్శిస్తె సమస్యలు, తెలుస్తాయి అంటున్నారు,







# 20012002 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘన విజయం

**కామంచికల్ :జూన్ 14:(డిడి 9వార్త)**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS), కామంచికల్‌లో 20012002 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. దాదాపు 24 సంవత్సరాల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందోత్సాహాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందించిన ఉపాధ్యాయులు కె. వెంకటేశ్వర్లు (హెచ్ఎం), జి. రామమూర్తి , ఎం. అనంతరాములు, ఎం.డి. ఉమర్, టి. వీరయ్య , ఎం.డి. షమీమ్ తలత్, టి. బుచ్చిబాబు, పి. ప్రసూన, ఎం. రోహిణి, వై. ప్రేమలత, ఎ. రమాదేవి లను పూలతో ఆహ్వానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి, మెమెంటోలు అందించి ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ముందుగా విద్యార్థుల ముకాముఖి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ వద్ద చదువుకున్న విద్యార్థులు నేడు వివిధ రంగాలలో ఉన్నత స్థానాల్లో ఉండటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా 20012002 బ్యాచ్ నుండి పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకోవడం గర్వకారణమని తెలిపారు.

ఈ సందర్భంగా బ్యాచ్‌కు చెందిన బొడా రమేష్ ప్రస్తుతం వరంగల్‌లో ఐటీ సీఐగా విధులు నిర్వహిస్తున్నారని, అలాగే యాట, రంగారావు, మలోత్ రమేష్, భూక్య ఉపేందర్ పోలీసు శాఖలో,మేకల సైదులు ఆర్మీ డిపార్ట్మెంట్ లో,భూక్యా వీరన్న BHEL ఢిల్లీలో సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా రాగి సత్యనారాయణ, అంబేద్కర్, పుల్లారావు, కొప్పెర సత్యనారాయణ, నామాల నాగరాజు, షేక్ జానీ తదితరులు ప్రైవేట్ రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి బ్యాచ్‌కు మంచి గుర్తింపు తీసుకువచ్చారని,మగవారికేమి తాక్కువ ఎమ్ కావంటూ,ఆడపిల్లలు స్వంత వ్యాపారంలో ఎదిగి న వారిలో కల్యాణి, పద్మజ,జ్యోతి,విప్రో లో సుజాత,కొందరు వ్యవసాయ రంగంలో ఎదిగిన వారు కూడా ఉన్నారని కొనియాడారు.

ఈ కార్యక్రమాన్ని పూర్తిగా 20012002 బ్యాచ్ విద్యార్థులు, విద్యార్థినులే స్వచ్ఛందంగా విరాళాలు సమకూర్చుకొని నిర్వహించడం విశేషం. వివిధ జిల్లాల నుండి వచ్చిన పూర్వ విద్యార్థినులు కూడా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

మధ్యాహ్న భోజనానంతరం ఉపాధ్యాయుల సన్మానం, మాటామంతీ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం టీ బ్రేక్ తర్వాత అందరూ కలిసి గ్రూప్ ఫోటోలు దిగారు. పాఠశాల రోజుల సరదా జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయులతో కలిసి ఆనందంగా గడిపారు. తదనంతరం వినోద కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం కార్యక్రమాన్ని ముగించారు.

ఈ ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ అందరి హృదయాలలో చిరస్మరణీయ జ్ఞాపకంగా నిలిచింది.

# బాధిత కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ

- **ఆర్థిక సహాయం అందజేసిన మండల అధ్యక్షుడు :పాలడుగు వెంకటకృష్ణ**

**గోవిందరావుపేట, జూన్ 14 ( డిడి 9 వార్త)**

మండలంలోని రాంనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్బీనగర్ గ్రామానికి చెందిన కోటే వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు.

మంత్రి సీతక్క ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు ఆదివారం మృతుడి నివాసానికి చేరుకున్న గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, వెంకటేశ్వర్లు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబం ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్మికశాఖ అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సూదిరెడ్డి జనార్ధన్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూడి సత్తిరెడ్డి, రాంనగర్ సర్పంచ్ ఆలోత్ స్రవంతికిషన్, దుంపెల్లిగూడెం గ్రామ అధ్యక్షుడు బొల్లు కుమార్, కందుల అశోక్, సామ నరేందర్ రెడ్డి, ఈసం కమలాకర్, కోటే కృష్ణారావు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# నేటి నుంచి విద్యాలయాల్లో సందడి.

- వేసవి సెలవులకు ముగింపు.. కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో ప్రారంభమైన విద్యా సంవత్సరం
- పుస్తకాలతో బడిబాట పట్టనున్న విద్యార్థులు..

**గోవిందరావుపేట, జూన్ 14 (డిడి 9 వార్త)**





దాదాపు రెండు నెలల పాటు కొనసాగిన వేసవి సెలవులకు తెరపడింది. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో విద్యాలయాలు మళ్లీ విద్యార్థుల సందడితో కళకళలాడనున్నాయి. కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

వేసవి సెలవుల అనంతరం పాఠశాలల గంట మోగనుండటంతో విద్యార్థులు కొత్త పుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, యూనిఫాంలతో బడిబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా మొదటిసారిగా పాఠశాలలో అడుగుపెట్టనున్న చిన్నారుల్లో ఉత్సాహం కనిపిస్తుండగా, పదో తరగతి వంటి కీలక తరగతుల్లోకి ప్రవేశిస్తున్న విద్యార్థులు తమ భవిష్యత్తుపై ఆశలతో కొత్త విద్యా సంవత్సరాన్ని ప్రారంభించనున్నారు.

**విద్యార్థుల రాకకు సిద్ధమైన పాఠశాలలు**

పాఠశాలల ప్రారంభానికి ముందే అన్ని విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. తరగతి గదుల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుత్ సరఫరా, ఫర్నిచర్ అందుబాటు వంటి అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టారు. విద్యార్థులకు తొలి రోజు నుంచే మెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

**పుస్తకాల దుకాణాలు, యూనిఫాం షాపుల్లో రద్దీ**

పాఠశాలల ప్రారంభం నేపథ్యంలో గత కొన్ని రోజులుగా పుస్తకాల దుకాణాలు, యూనిఫాం కేంద్రాలు, స్టేషనరీ షాపుల్లో తల్లిదండ్రులు, విద్యార్థుల రద్దీ పెరిగింది. కొత్త తరగతులకు అవసరమైన విద్యా సామగ్రిని కొనుగోలు చేయడంలో తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు. దీంతో విద్యాసంవత్సరం ప్రారంభోత్సాహం ఇప్పటికే కనిపిస్తోంది.

**విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచనలు**

విద్యార్థులు సమయపాలన పాటిస్తూ చదువుపై పూర్తి దృష్టి కేంద్రీకరించాలని, మొబైల్ ఫోన్లు, టెలివిజన్ వంటి వాటికి దూరంగా ఉండి విద్యా లక్ష్యాలను సాధించాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ప్రతి రోజూ పాఠశాలకు హాజరవుతూ పాఠాలను క్రమం తప్పకుండా అభ్యసిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొంటున్నారు.

**కొత్త విద్యా సంవత్సరం..**
**కొత్త విజయాలకు నాంది**

విద్యార్థుల జీవితంలో ప్రతి విద్యా సంవత్సరం ఒక కొత్త అధ్యాయమని, నేటి నుంచి ప్రారంభమవుతున్న కొత్త విద్యా సంవత్సరం వారికి మరిన్ని విజయాలను అందించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆకాంక్షిస్తున్నారు. విద్యాలయాల ప్రాంగణాలు మళ్లీ చిన్నారుల కేరింతలు, విద్యార్థుల సందడితో మార్మోగనున్న వేళ, నూతన విద్యా సంవత్సరం విజయవంతంగా సాగాలని ప్రతి ఒక్కరూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## విద్యార్థుల ప్రవేశాలు తగ్గడానికి పాలకుల విధానాలే కారణం

- టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు

**భద్రాచలం, జూన్ 14 డిడి9 వార్త**

విద్యారంగానికి బడ్జెట్లో సరిపడా నిధులు కేటాయించకపోవడం పాఠశాలలో కనీస వసతి సౌకర్యాలు కల్పించకపోవడం తగినంత మంది ఉపాధ్యాయులను సరైన సమయంలో నియమించకపోవడం వల్లనే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు ప్రతి సంవత్సరం తగ్గుతూ వస్తున్నాయని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు అన్నారు. టిపిటిఎఫ్ భద్రాచలం కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు పాయం కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన భద్రాచలం ప్రాంత బాధ్యుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాలకులు మారినప్పుడల్లా తమకు అనుకూలమైన రీతిలో విద్యారంగాన్ని అనేక మార్పులకు గురిచేస్తూ పేద బలహీన వర్గాల బాలబాలికలకు విద్యను దూరం చేయాలని చూస్తున్నారని అన్నారు. విద్యను సరుకుగా, వ్యాపార రంగంగా మార్చారని అన్నారు. విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని మూతబడిన ఆరు వేల పాఠశాలలను తెరిపిస్తామని ప్రతి ఆవాస ప్రాంతంలో ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పుతామని ఎన్నికల ప్రణాళికలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి 27 వేల పాఠశాలలను 4 వేలకు కుదిస్తామని చెప్పిన ప్రకటనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు తాటి సత్తిబాబు, పాయం కృష్ణయ్య, రాష్ట్ర మాజీ కార్యదర్శి మునిగడప రామాచారి, వివిధ మండలాల బాధ్యులు బి.ప్రకాష్ రావు, వి.ముత్తయ్య, బి.రవి పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దందాపై చర్యలు తీసుకోవాలి

- అధిక ఫీజులతో తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేయొద్దు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: గూడపు రణధీర్

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 14 (డిడి9 వార్త):**

రేపటి నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేసి విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేయవద్దని బీఆర్ఎస్‌వీ నాయకుడు గూడపు రణధీర్ హెచ్చరించారు.

కొన్ని ప్రైవేట్ పాఠశాలలు భారీగా ఫీజులు పెంచడంతో పాటు పుస్తకాలు, యూనిఫాంల పేరుతో అదనపు భారం మోపుతున్నాయని ఆయన ఆరోపించారు. ఫీజుల వసూళ్లతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.

అలాగే ఫీజుల కారణంగా విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయడం, ఇతర ఇబ్బందులకు గురిచేయడం చట్టవిరుద్ధమని అన్నారు. విద్య హక్కును కాలరాసే విధంగా వ్యవహరించే పాఠశాలలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించి అధిక ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాల యాజమాన్యాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.






## భద్రాద్రి రామాలయంలో భక్తుల రద్దీ

- దర్శనంకు రెండు గంటలకు పైగా సమయం
- ఆర్జిత సేవలన్నీ రద్దు చేసిన దేవస్థానం
- రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం.

**భద్రాచలం, జూన్ 14 డిడి9 వార్త**

భద్రాచలంలో ఆదివారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో రామాలయంతో పాటు ఆలయ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. వేసవి సెలవులు ముగియడం, సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానుండటంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనం కోసం వచ్చారు. భక్తులు తెల్లవారుజాము నుంచే పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించి రామయ్య దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తుల సంఖ్య అధికంగా ఉండటంతో దేవస్థానంలో ఆర్జిత సేవలన్నీ రద్దు చేసి నేరుగా భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100 శీఘ్ర దర్శనంపై భక్తులను అనుమతించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తుల రద్దీ కొనసాగగా అనంతరం సాధారణ స్థితికి చేరుకుంది. అలాగే సాయంత్రం సైతం భక్తుల రద్దీ అధికంగానే ఉంది. దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం ఆదివారం సందర్భంగా రామాలయంలో భద్రాద్రి రామయ్యకు ప్రత్యేక అభిషేకం, నిత్యకల్యాణం నిర్వహించారు. నిత్యకల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేన అర్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.



## నేడు గిరిజన దర్బార్.....ప్రజావాణి

**భద్రాచలం, జూన్ 14 డిడి9 వార్త**

భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్, సబ్‌కలెక్టరు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు అధికారులంతా సకాలంలో హాజరై వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే వారి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించడంతో పాటు వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్టలు పేర్కొన్నారు. ప్రజలు తమ విజ్ఞాపన పత్రాలు, తగిన ధృవీకరణ పత్రాలతో రావాలని కోరారు.





## మురుగునీరు,చీకట్లు,ఓపెన్ నాలాలతో సాయిబాబా నగర్ సతమతం

- బస్తీబాటలో ప్రజల గోడు విన్న బీఆర్ఎస్ నేతలు
- సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే,అధికార యంత్రాంగం విఫలమైందని విమర్శలు

**రాజేంద్రనగర్,జూన్ 14 డిడి 9 వార్త**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ సాయిబాబా నగర్‌తో పాటు పలు కాలనీలు మౌలిక వసతుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.పార్టీ చేపట్టిన "బస్తీబాట"కార్యక్రమంలో భాగంగా కాటేదాన్ మైలార్దేవపల్లి,డివిజన్ ల అధ్యక్షులు ఎస్.వెంకటేష్, గుమ్మడి కుమార్ లు,పార్టీ నాయకులు కార్యకర్తలతో కలసి స్థానిక బస్తీల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.కాలనీలోని పలు వీధుల్లో దశాబ్దాల నాటి శివరేజ్ లైన్లు దెబ్బతిని మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోయారు.వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పరిస్థితి మరింత దారుణంగా మారిందని తెలిపారు.పలు ప్రాంతాల్లో వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు చీకట్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.రైల్వే ట్రాక్ సమీపంలోని ఓపెన్ నాలాలు మట్టితో నిండిపోవడంతో మురుగునీటి ప్రవాహం నిలిచిపోయిందని,దీంతో విషసర్పాలు,కీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు.సమస్యలపై పలుమార్లు జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆరోపించారు.

ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ.. "పేరుకే ప్రజాపాలన కానీ క్షేత్రస్థాయిలో మురికి పాలన నడుస్తోందని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న కనీస సమస్యలను కూడా ప్రభుత్వం,స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.పాత శివరేజ్ లైన్లను వెంటనే మార్చి కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని, వీధిదీపాలను పునరుద్ధరించాలని,ఓపెన్ నాలాలను శుభ్రపరచి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని,లేనిపక్షంలో ప్రజల తరపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాము యాదవ్, రాఘవేందర్ యాదవ్, జగదీష్,ప్రవీణ్,ఉప్పల్ శ్రీను, సరిత మహేష్,తదితరులు పాల్గొన్నారు.








## ఓట్ల తొలగింపునకు కుట్ర?

- ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం
- సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ భరోసా
- ఎస్ఐఆర్‌పై శ్రీధర్ బాబు తీవ్ర విమర్శలు

ప్రజాస్వామ్యానికి ప్రాణం ఓటు హక్కు అని, దానిని కాపాడుకోవడం ప్రతి కార్యకర్త బాధ్యత అని కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా ఎన్‌టీపీసీ కాజీపల్లిలో నిర్వహించిన బీఎల్ఏల అవగాహన శిక్షణ శిబిరం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ బలంగా ఉన్న ప్రాంతాల్లో ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పేర్లలో చిన్న చిన్న తప్పులు, చిరునామాల్లో వ్యత్యాసాలను కారణంగా చూపి లక్షలాది ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు కేంద్ర సంస్థలను ఉపయోగిస్తున్నారని విమర్శించారు. మేము విద్వేష రాజకీయాలు చేసే వాళ్లు కాదని, ప్రజల కోసం ప్రేమతో పని చేసే వాళ్లమని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని నిజంగా ఆలోచించే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని పూర్తిగా అభివృద్ధి చేసిన తర్వాతే ఎన్నికల ముందుకు వెళ్తామని చెప్పారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి రక్షణ కవచమని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి రాజ్యాంగ విలువలను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ విజయరమణరావు, హార్కర వేణుగోపాల్‌రావు, దుద్దిళ్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొని ఓటు హక్కు పరిరక్షణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ శిబిరం కాంగ్రెస్ శ్రేణులకు ఎన్నికల సన్నాహక వేదికగా మారింది.



# సేవే లక్ష్యం.. రక్తదానమే స్ఫూర్తి

- **100 సార్లు రక్తదానం లక్ష్యంగా కానిస్టేబుల్ ఎస్.కె. లాల్ మొహమ్మద్...**

**కన్నాయిగూడెం, జూన్ 14:(డిడి9 వార్త)**




ప్రజల భద్రత కోసం పోలీస్ విధులు నిర్వహిస్తూనే, మానవత్వాన్ని చాటుతూ రక్తదానంతో ఎందరో ప్రాణాలను కాపాడుతున్న కానిస్టేబుల్ ఎస్.కె. లాల్ మొహమ్మద్ సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి. రక్తదానాన్ని తన జీవిత ధ్యేయంగా మార్చుకొని సమాజ సేవలో ముందంజలో నిలుస్తున్నారు. అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన ఆయన 2009లో ప్రారంభించిన రక్తదాన ప్రయాణాన్ని నేటికీ నిరంతరంగా కొనసాగిస్తున్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు.ఇప్పటివరకు 35 సార్లు రక్తదానం చేసి అత్యవసర పరిస్థితుల్లో ఉన్న అనేక మంది ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషించారు.

ప్రతి సంవత్సరం కనీసం రెండు సార్లు రక్తదానం చేయడాన్ని అలవాటుగా మార్చుకున్న లాల్ మొహమ్మద్, జీవితంలో 100 సార్లు రక్తదానం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే రక్తదానం చేస్తూ, పేదలకు మరియు అవసరమైన వారికి నేరుగా ఉపయోగపడాలనే సేవాభావాన్ని చాటుతున్నారు.

"రక్తదానం అనేది ప్రాణదానం. ప్రతి ఆరోగ్యవంతుడు రక్తదానం చేయడానికి ముందుకు రావాలి" అని ఆయన పిలుపునిచ్చారు. పోలీస్ విధుల్లో నిబద్ధతతో పాటు సామాజిక బాధ్యతను కూడా సమర్థవంతంగా నిర్వర్తిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

వైద్య నిపుణుల ప్రకారం రక్తదానం వల్ల అవసరమైన వారికి ప్రాణరక్షణ కలగడమే కాకుండా, దాత ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడటంతో పాటు కొత్త రక్తకణాల ఉత్పత్తికి దోహదపడుతుంది.

సేవా భావం, అంకితభావం, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తున్న కానిస్టేబుల్ ఎస్.కె. లాల్ మొహమ్మద్ సేవలను ప్రజలు, అధికారులు అభినందిస్తున్నారు. రక్తదానాన్ని ఉద్యమంగా మార్చి మరింత మందికి స్ఫూర్తినివ్వాలన్న ఆయన సంకల్పం అభినందనీయం.

# ఏటూరునాగారం క్రాస్ లో ఉద్రిక్తత,,,!!

- **గిరిజన,గిరినేతరుల మధ్య భూవివాదం,,,**
- **ఐటిడి ఏ సమీపంలో రాళ్లకుంట భూమిలో ఇళ్లనిర్మాణం,,**
- **ఈభూమి మాదని ట్రైబల్స్ మాకుహక్కుందని ఇతరులు**
- **ఇరువర్గాలు కొట్టుకునె ఉద్రిక్తం నెలకుంది,,,**
- **ఏటూరునాగారం ఎస్సైమహేష్ ఆద్వర్యంలో పోలీసులు,,,**

**ఏటూరునాగారం క్రైం,డి డి 9 వార్త జూన్ 14,**

ఏటూరునాగారం క్రాస్ లో ఉద్రిక్తత నెలకొనగా పోలీసు లు రంగప్రవేశం చేసి పరిస్థితిసద్దుమనిగేలా చేశారు వివరా లోకి వెల్లితె ములుగుజిల్లాలోని ఏటూరునాగారం సబ్ డివిజన్ లొ గిరిజనేతరులు క్రాస్ రోడ్ లొ కుంట చుట్టు ఇళ్లువేసు కుని టున్నారు రాళ్లు కుంటప్రాంతం గిరిజనులదని ట్రైబల్స్ గుంపులుగా అక్కడి కి చేరుకున్నారు ఇళ్లవద్దకు వచ్చిగొడవ చేస్తుండగా ఇళ్లలొ నుంచి గిరిజనేతరులు బయ టకు వచ్చి అడ్డుకున్నారు మాదంటె మాదని కొట్టుకునెదాక వచ్చింది ఈవిషయం తెలవ గానె సి ఐ అనుముల శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎస్సై మహెష్ అద్వర్యంలొ పోలీసులు రంగప్రవేశం చేశారు ఇరువర్గా ల మద్యగొడవను సద్దు మనెగె విధంగ సమస్యను పరిస్కరించారు, ఎన్నొ ఏండ్లుగా ఇండ్లువేసుకుని ఉంటుండగ ఇప్పుడొచ్చి ట్రైబల్ భూముల ని గొడవచేస్తు రావడం ఏంత వరకు సమంజసం అనిప్రశ్నించారు,



# యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తా

**నిజామాబాద్ జిల్లా, జూన్ 14(డీడీ9 వార్త) :**


తెలంగాణ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్‌గా నియమితులైన అల్లే లావణ్య రమేష్  యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం మరియు విద్యా ప్రమాణాల పెంపుదలకు తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు. యూనివర్సిటీని మరింత ఉన్నత స్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని లావణ్య రమేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కొత్త బాధ్యతలు చేపట్టిన ఆమెకు వీసీ, రిజిస్ట్రార్ శుభాకాంక్షలు తెలిపారు.



# ఓటుపై కన్నేస్తే ఊరుకోం!!








- **పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం**
- **ఉద్యోగాలకు రేట్లు కట్టిన పాలన గత ప్రభుత్వాలది**
- **కార్మికుల పేరుతో కపట ప్రేమ**
- **కాంగ్రెస్ కార్యకర్తలే బలం, విజయానికి అంకితభావమే పునాది**
- **ఓటు కాపాడితేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది**
- **బీఎల్‌ఏల శిక్షణలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సందేశం**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 14 (డిడి9 వార్త):**

ఓటు హక్కుపై దాడి జరిగితే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదు, ప్రతి ఓటును కాపాడటం కోసం కార్యకర్తలు కవచంలా నిలవాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీలో ఆదివారం జరిగిన బీఎల్‌ఏల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. రాబోయే పదేళ్లు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేసిన ఆయన, గత పాలకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉద్యోగం కావాలంటే అర్హత కాదు, లక్షల రూపాయల లంచం అవసరమైన దుస్థితిని గత ప్రభుత్వం సృష్టించిందని ఆరోపించారు. పేదల కన్నీళ్లపై రాజకీయ సామ్రాజ్యం నిర్మించిన వాళ్లు ఇప్పుడు మళ్లీ కార్మికుల ప్రేమికులమంటూ నటించడం హాస్యాస్పదమన్నారు. సింగరేణి కార్మికులను, నిరుద్యోగ యువతను మోసం చేసిన చరిత్రను ప్రజలు మరచిపోలేదని వ్యాఖ్యానించారు. ఒకవైపు ఓటర్ల జాబితాల్లో అక్రమాలపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ, మరోవైపు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు. అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ఓటరు అందుబాటులో లేడనే కారణంతో ఓటు తొలగించే పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒక్క ఓటు కూడా కోల్పోకూడదని, ప్రతి ఓటరిని గుర్తించి జాబితాల్లో వారి పేర్లు ఉండేలా బీఎల్‌ఏలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలను గుర్తు చేసుకునే రాజకీయాలకు కాంగ్రెస్ భిన్నమని, ప్రజల మధ్య నుంచే ఎదిగిన పార్టీగా వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదని, భవిష్యత్తును నిర్ణయించే ఆయుధమని పేర్కొన్నారు. కుట్రలు, కుతంత్రాలు, తప్పుడు ప్రచారాలతో ప్రజల తీర్పును మార్చాలని చూసే శక్తులను ప్రజలే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, నిజంఅబద్ధం మధ్య తేడా గుర్తించే శక్తి వారికుందని అన్నారు. ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల అంకితభావమే కాంగ్రెస్‌కు బలమని, అదే బలం రాబోయే ఎన్నికల్లో మరింత ఘన విజయానికి దారి తీస్తుందని రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు.

# వేగం ప్రాణం తీసింది..

- **అదుపుతప్పి కల్వర్టు ఢీకొన్న ద్విచక్ర వాహనం.. ఇద్దరు మృతి..**

**జూన్ 14 డిడి9 వార్త వెంకటాపురం.**







ములుగు జిల్లా వెం క టా పు రం మండల శివారు చొక్కాల ఇప్పలగూడెం మూలమలుపు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎటూరునాగారం ప్రాంతానికి చెందిన నూక మహేష్ (28), మడప నందయ్య (45) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఇప్పలగూడెం ప్రధాన రహదారిపై ఉన్న ప్రమాదకర మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి.

మహేష్‌కు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కాగా, నందయ్య పరిస్థితి విషమంగా మారింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ రాజ్యలక్ష్మి, పైలట్ రాధాస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మడప నందయ్య ఆదివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నూక మహేష్‌కు చికిత్స కొనసాగుతోంది. ఘటనపై వెంకటాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో ప్రజ్ఞశ్రీ విద్యార్థిని వైష్ణవి ప్రతిభ

**నిజామాబాద్ జిల్లా, జూన్ 14(డీడీ9 వార్త) :**



తెలుగు సాహిత్య చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహాకవి శ్రీశ్రీ 43వ వర్ధంతి సభను నిజామాబాద్   నగరంలోని ఆల్ పెన్షనర్స్ భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజానాట్యమండలి, అరుణోదయ, అరుణోదయ ఇందూరు సాంస్కృతిక కళావేదిక తదితర సాహితీ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం దిగ్విజయంగా సాగింది. ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు సిర్పలింగం అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. శ్రీశ్రీ ఒక వ్యక్తి కాదు, ఒక అజేయమైన శక్తి అని కొనియాడారు. సినిమా రచనలు, అభ్యుదయ, విప్లవ రచయితల సంఘాల్లో ఆయన పాత్ర, ఉద్యమాలకు ఊపిరి పోసిన ఆయన కవిత్వం నేటికీ యువతను ఉత్తేజపరుస్తున్నాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లాం ప్రతినిధి హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో శ్రీశ్రీ సాహిత్యాధ్యయనం యువతకు ఎంతో అవసరమని, కులమతాల కతీతంగా మానవత్వమే ప్రాతిపదికగా శ్రీశ్రీ రచనలను అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల నాయకులు గంగులు, అరుణోదయ గంగన్న, అరుణోదయ సాయిరెడ్డి, కామారెడ్డి నుంచి విచ్చేసిన రెడ్డి రాజయ్య, ఈవీఎల్ పాల్గొన్నారు. కవి పురుషోత్తం రావు తన కవితా గానంతో అలరించగా, శ్రీలత, శ్రీనివాస్, షాదుల్లా శ్రీశ్రీ సినీ గీతాలను, పాటలను వినిపించి సభను రంజింపజేశారు. చివరగా చరణ్ కృతజ్ఞతలు తెలుపుతూ సభను ముగించారు. ఈ కార్యక్రమంలో కవులు, గాయకులు, మేధావులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుని పరామర్శించిన బోత్ మాజీ ఎమ్మెల్యే

**ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం( D D 9) న్యూస్ వార్త జూన్ 14 ఆదివారం**

తలమడుగు మండలంలో సుంకిడి గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుడు ఆశన్న యాదవ్ అనారోగ్యానికి గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న బోత్ మాజీ ఎమ్మెల్యే తెలంగాణ రక్షణ సేన స్టేట్ అబ్జర్వేజర్ శ్రీ రాథోడ్ బాపురావు తెలంగాణ ఉద్యమకారులకు సరైన గౌరవం కల్వకుంట్ల కవిత Trs పార్టీతోనే సాధ్యమన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## వాహన నంబర్, ఛాసిస్, ఇంజిన్ నంబర్లను ఫోర్జరీ చేసి
# తెలంగాణలో రిజిస్ట్రేషన్‌కు యత్నం

- **వాహన తనిఖీలలో పట్టుబడ్డ నిందితులు**
- **ముగ్గురిపై కేసు నమోదు, అరెస్ట్, రిమాండ్.**
- **నకిలీ పత్రాలు, ఫోర్జరీ వ్యవహారంపై కేసు నమోదు**

**ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి**

ఆదిలాబాద్ జిల్లా, బోథ్ (డి డి 9వార్త ):
A1) ఎస్.కె. నయీమ్ (37) s/o షేక్ బీబన్, వృత్తి : డ్రైవర్, నివాసం : సోనాల గ్రామం, బోథ్ మండలం. A2) మాకునూర్ విజయ్ కుమార్, వాహనానికి సంబంధించిన ఛాసిస్, ఇంజిన్ నంబర్లను తొలగించి ఫోర్జరీ వెల్డింగ్ పనులు చేసిన వ్యక్తి. A3) పెందూర్ ఇంద్రు, స్క్రాప్‌కు వెళ్లిన ఏపీ 23 జె 1036 వాహనానికి సంబంధించిన పత్రాలను నిందితుడికి అందజేసిన వ్యక్తి.స్క్రాప్ చేయబడిన వాహనాల నంబర్ల సహాయంతో రిజిస్ట్రేషన్కు పాల్పడిన మోసగాళ్లను అరెస్టు చేయడం జరిగిందని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి బోథ్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన పాత్రికా సమావేశంలో వివరాలను వెల్లడించారు. జూన్ 13వ తేదీ ఉదయం బోథ్ కోరమాండల్ జంక్షన్ వద్ద పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒక మహీంద్రా మ్యాక్స్ వాహనం పోలీసులను గమనించి వెనక్కి తిరిగి వెళ్లేందుకు ప్రయత్నించింది. అనుమానం రావడంతో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, వాహనానికి సంబంధించిన ఛాసిస్ నంబర్, ఇంజిన్ నంబర్లలో మార్పులు చేసినట్లు గుర్తించారు.

వాహన డ్రైవర్ ఎస్.కె. నయీమ్‌ను విచారించగా, మహారాష్ట్ర రాష్ట్రంలోని లాతూర్ ప్రాంతం నుండి మహీంద్రా మ్యాక్స్ వాహనాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ఆ వాహనానికి సరైన పత్రాలు లేకపోవడంతో తెలంగాణలో రిజిస్ట్రేషన్ పొందేందుకు మరో వాహనానికి సంబంధించిన పత్రాలు, నంబర్లను ఉపయోగించి ఫోర్జరీ చేసినట్లు ఒప్పుకున్నాడు.

మాకునూర్ విజయ్ కుమార్ ఇంటి వద్ద అసలు ఛాసిస్, ఇంజిన్ నంబర్లను తొలగించి ఫోర్జరీ పనులు చేయించినట్లు వెల్లడైంది. అలాగే స్క్రాప్‌కు వెళ్లిన AP 23 J 1036 వాహనానికి చెందిన పత్రాలను పెందూర్ ఇంద్రు వద్ద నుండి రూ.10,000లకు సేకరించి వాటిని ఉపయోగించి నకిలీ పత్రాలు రూపొందించినట్లు తెలిసింది. ఈ ఘటనపై బోథ్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం.140/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ అధికారులను మోసం చేయడం, నకిలీ పత్రాలు సృష్టించడం, వాహన వివరాలను ఫోర్జరీ చేయడం వంటి అంశాలపై విచారణ  కొనసాగుతున్నదని  తెలిపారు.ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఇంజన్ నెంబర్లు, చేసేస్ నెంబర్లు చెరిపివేసిన వాహనాలను ప్రజలు కొనవద్దని ఒరిజినల్ ఆర్ సి చూసిన తర్వాతనే వాహనాలను కొనాలని సూచించారు. అదేవిధంగా ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. చేసేస్ నెంబర్లను ఇంజన్ నెంబర్లను చెరిపి వేయడానికి ప్రయత్నించిన వారిపై సైతం చర్యలు తీసుకోబడ్డాయని తెలిపారు. నిందితులపై ఫోర్జరీ మరియు చీటింగ్ కేసులను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో సీఐ డీ గురుస్వామి, బోథ్ ఎస్ఐ వి. పురుషోత్తం, హెడ్ కానిస్టేబుల్ మదన్, పోలీస్ సిబ్బంది కీలక పాత్ర పోషించినట్లు డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి అభినందించారు.



# రోహిత్ శర్మ రనౌట్ హైడ్రామా.. గిల్ క్లారిటీతో ముగిసిన వివాదం!

- గిల్‌తో సమన్వయ లోపంతో రోహిత్ రనౌట్
- అసహనం వ్యక్తంచేస్తూ మైదానం వీడిన సీనియర్ బ్యాటర్
- మ్యాచ్ అనంతరం రనౌట్‌పై స్పష్టతనిచ్చిన గిల్
- డ్రెస్సింగ్ రూమ్‌లో రోహిత్ రీప్లే చూశాడని వివరణ



**డిడి9 వార్త:**
ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో భారత్ ఘన విజయం సాధించినప్పటికీ.. మైదానంలో టీమిండియా ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ మధ్య జరిగిన 'రనౌట్ హైడ్రామా' క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇద్దరి మధ్య జరిగిన కమ్యూనికేషన్ గ్యాప్ కారణంగా సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ రనౌట్ కావడం, అనంతరం అతడు అసంతృప్తితో మైదానాన్ని వీడటంపై సోషల్ మీడియాలో అభిమానుల మధ్య పెద్ద యుద్ధమే నడిచింది. అయితే, మ్యాచ్ ముగిసిన అనంతరం కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇచ్చిన క్లారిటీతో ఈ వివాదానికి తెరపడింది.
వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక వయసులో బరిలోకి దిగిన భారత పురుష క్రికెటర్‌గా రికార్డు సృష్టించిన రోహిత్ శర్మ (16 పరుగులు), ఇన్నింగ్స్ 6వ ఓవర్లో రనౌట్ అయ్యాడు. సింగిల్ తీసే క్రమంలో గిల్‌తో సమన్వయ లోపం కారణంగా రనౌట్ అయి పెవిలియన్ చేరాడు. పరుగు కోసం రోహిత్ క్రీజు వదిలి చాలా దూరం వచ్చేసినా.. గిల్ మాత్రం బంతి వైపు చూస్తూ క్రీజులోనే ఉండిపోయాడు. దీంతో రోహిత్ వెనక్కి వెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఔట్ అయిన వెంటనే రోహిత్ శర్మ తీవ్ర ఆగ్రహంతో గిల్ వైపు చూస్తూ అసహనం వ్యక్తం చేయడం స్టంప్ మైక్‌లో కూడా రికార్డయింది. దీంతో యువ కెప్టెన్ గిల్‌పై రోహిత్ తీవ్ర అసంతృప్తితో ఉన్నాడనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.
కాగా, రోహిత్ శర్మ అవుట్ అయిన తీరు అభిమానులకు సరిగ్గా రెండేళ్ల క్రితం నాటి 'మొహాలీ సీన్'ను గుర్తుకు తెచ్చింది. 2024లో మొహాలీ వేదికగా అఫ్ఘనిస్థాన్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లోనూ రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఉండి.. ఇదే విధంగా శుభ్‌మన్ గిల్‌తో జరిగిన కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల డక్ అవుట్ (0) అయ్యాడు.
ఈ హైడ్రామాపై మ్యాచ్ అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గిల్ స్పందిస్తూ అసలు నిజాలను వెల్లడించాడు. "మైదానంలో అది కేవలం ఒక చిన్న కమ్యూనికేషన్ లోపం మాత్రమే. డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిన తర్వాత రోహిత్ భాయ్ స్వయంగా ఆ రనౌట్ రీప్లేను చూశాడు. ఆ సమయంలో అక్కడ ఏం జరిగిందో ఆయనకు అర్థమైంది. మా ఇద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవు, అంతా సవ్యంగానే ఉంది" అని క్లారిటీ ఇచ్చాడు. అంతేకాకుండా, గతంలో కూడా ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 మ్యాచ్ ఆడుతున్నప్పుడు కూడా రోహిత్ ఇలాగే రనౌట్ అయిన విషయాన్ని గిల్ గుర్తుచేస్తూ.. సీనియర్ ప్లేయర్‌గా రోహిత్‌కు ఆటలోని పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందన్నాడు. కెప్టెన్ ఇచ్చిన ఈ సూటి వివరణతో అభిమానుల మధ్య నడుస్తున్న రనౌట్ వివాదానికి పూర్తిగా ఫుల్‌స్టాప్ పడింది.




## విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలి

- విద్యార్థి సంఘాల జేఏసీ డిమాండ్

**బోధన్: నిజామాబాద్ జిల్లా, జూన్ 14(డీడీ9 వార్త) :**
నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను కల్పించాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బోధన్ పట్టణం పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు ఎన్. బాల్‌రాజ్, ఎం.డి.మోషిన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను సకాలంలో అందించాలని కోరారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, తాగునీరు, మరుగుదొడ్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజన సౌకర్యాలను కల్పించాలని, విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ప్రైవేట్ విద్యాసంస్థలు పూర్తిస్థాయి వసతులు కల్పించాలని, అర్హత కలిగిన ఉపాధ్యాయుల చేతనే బోధన చేయించాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో నిర్ణీత ఫీజులే వసూలు చేయాలని, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పేరుతో యాజమాన్యాలు వ్యాపారం చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తినా జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు తల్లూరి సంజయ్, డి. కిరణ్, రాజన్న, మోహన్, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

# మహిళల ప్రపంచకప్‌లో హైఓల్టేజ్ మ్యాచ్: పాక్‌పై టాస్ గెలిచిన భారత్

- మహిళల టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో భారత్ కీలక పోరు
- టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్
- పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- తుది జట్టులో యాస్తిక స్థానంలో భారతి ఫుల్మాలికి చోటు
- తాము కూడా బ్యాటింగే ఎంచుకునేవాళ్లమని చెప్పిన పాక్ కెప్టెన్ ఫాతిమా సనా




**డిడి9 వార్త:**
మహిళల ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో అసలు సిసలైన సమరానికి రంగం సిద్ధమైంది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో కీలక మ్యాచ్‌లో భారత మహిళల జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో, ముందుగా భారీ స్కోరు సాధించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది.
టాస్ గెలిచిన అనంతరం హర్మన్‌ప్రీత్ మాట్లాడుతూ.. "ఈ పిచ్ బ్యాటింగ్ చేయడానికి చాలా బాగుంది. అందుకే మేము ముందుగా బ్యాటింగ్ చేసి, బోర్డుపై ఒక మంచి స్కోరు ఉంచాలనుకుంటున్నాం. గత ప్రపంచకప్ విజయం మాకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఆ నమ్మకాన్ని ఈ టోర్నీలోనూ కొనసాగించాలనుకుంటున్నాం" అని పేర్కొంది. జట్టులో మార్పుల గురించి ప్రస్తావిస్తూ, "యాస్తిక బాగా ఆడినప్పటికీ, ఈ మ్యాచ్‌లో ఆమె స్థానంలో భారతి ఫుల్మాలికి అవకాశం ఇస్తున్నాం. మేము ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు మీడియం పేసర్లతో బరిలోకి దిగుతున్నాం" అని వివరించింది.
మరోవైపు, పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా మాట్లాడుతూ.. తాము కూడా టాస్ గెలిస్తే బ్యాటింగే ఎంచుకునేవాళ్లమని తెలిపింది. "ఈ పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామంలా కనిపిస్తోంది. మా బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టుగా రాణిస్తున్నాం. బౌలింగ్ యూనిట్ బలంగా ఉంది, బ్యాటింగ్‌లో మరింత మెరుగుపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో హోరాహోరీ పోరు ఖాయం. సైరా జబీన్ ఈ మ్యాచ్‌తో ప్రపంచకప్‌లో అరంగేట్రం చేస్తోంది" అని ఆమె వెల్లడించింది.
కోచ్ వహాబ్ రియాజ్ ఆధ్వర్యంలో పాకస్థాన్ జట్టు టీ20 క్రికెట్‌లో దూకుడుగా ఆడేందుకు కొత్త వ్యూహాన్ని అనుసరిస్తోంది. ఈ విధానంతో జింబాబ్వేపై విజయం సాధించినప్పటికీ, ఆ తర్వాత జరిగిన సిరీస్‌లు, వార్మప్ మ్యాచ్‌లలో ఆశించిన ఫలితాలు రాలేదు. ఈ నేపథ్యంలో, తమ కొత్త దూకుడు విధానానికి స్థిరత్వాన్ని జోడించి, చిరకాల ప్రత్యర్థిపై గెలవాలని పాకిస్థాన్ పట్టుదలతో ఉంది. మరోవైపు, సరైన కూర్పుతో బరిలోకి దిగి టోర్నీలో మరో విజయాన్ని నమోదు చేయాలని భారత్ భావిస్తోంది.

**తుది జట్లు:**
భారత మహిళల జట్టు: స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), భారతి ఫుల్మాలి, రిచా ఘోష్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, శ్రీ చరణి, క్రాంతి గౌడ్.
పాకిస్థాన్ మహిళల జట్టు: గుల్ ఫిరోజా, మునీబా అలీ (వికెట్ కీపర్), ఆయేషా జాఫర్, సైరా జబీన్, ఆలియా రియాజ్, నతాలియా పర్వైజ్, ఫాతిమా సనా (కెప్టెన్), రమీన్ షమీమ్, నష్రా సంధు, తస్మియా రుబాబ్, సాదియా ఇక్బాల్.

# పాక్ బౌలర్లను ఉతికి ఆరేసిన స్మృతి.. టీ20 వరల్డ్‌కప్‌లో అరుదైన రికార్డు..




**డిడి9 వార్త:**
ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధనా సరికొత్త రికార్డుతో చెలరేగింది. దాయాది దేశమైన పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత అర్ధసెంచరీతో మెరిసిన మంధనా, భారత్ తరఫున టీ20 ప్రపంచకప్‌లలో అత్యధిక సార్లు 50 ప్లస్ స్కోర్లు చేసిన దిగ్గజాల సరసన చేరింది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన ఈ హైవోల్టేజ్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత మహిళల జట్టుకు మంధనా వెన్నుముకగా నిలిచింది. ఇన్నింగ్స్ 11.2 ఓవర్ వద్ద పాక్ బౌలర్ రామీన్ షమీమ్ వేసిన ఫ్లైటెడ్ డెలివరీని క్రీజ్ వెలుపలికి వచ్చి, ఎక్స్‌ట్రా కవర్ మీదుగా అద్భుతమైన ఇన్ సైడ్ అవుట్ షాట్‌తో బౌండరీగా మలచి ఆమె తన హాఫ్ సెంచరీని పూర్తి చేసుకుంది. మధ్యలో ఒకసారి లైఫ్ లభించినప్పటికీజజ ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ చివరి కొన్ని ఓవర్లలో ఆమె బ్యాట్ వేగాన్ని పెంచింది. అయితే మొత్తం మీద 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 154.55 స్ట్రైక్ రేట్‌తో 68 పరుగులు చేసి షమీమ్ బౌలింగ్ లోనే అవుటయి వెనుదిరిగింది.
స్మృతి మంధనా మెరుపు ఇన్నింగ్స్‌తో మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలో భారత్ తరఫున అత్యధిక యాభై అంతకంటే ఎక్కువ స్కోర్లు (50+ స్కోర్లు) చేసిన టాప్ బ్యాటర్ల జాబితాలో స్మృతి మంధనా అగ్రస్థానానికి చేరుకుంది. ఇప్పటివరకు ఈ రికార్డు కేవలం మిథాలీ రాజ్, హర్మన్‌ప్రీత్ కౌర్ పేరిట మాత్రమే ఉండేది.

**టీ20 ప్రపంచకప్‌లలో భారత్ తరఫున అత్యధిక 50 ప్లస్ స్కోర్లు..**
స్మృతి మంధనా: 5 (26 ఇన్నింగ్స్‌లు), మిథాలీ రాజ్: 5 (23 ఇన్నింగ్స్‌లు), హర్మన్‌ప్రీత్ కౌర్: 5 (34 ఇన్నింగ్స్‌లు), పూనమ్ రౌత్: 3 (15 ఇన్నింగ్స్‌లు). కేవలం 26 ఇన్నింగ్స్‌ల్లోనే మంధనా ఈ మైలురాయిని అందుకోవడం విశేషం. ప్రస్తుతం 15 ఓవర్లు ముగిసేసరికి భారత్ 4 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసింది. షఫాలీ వర్మ (6), జెమిమా రోడ్రిగ్స్ (1) త్వరగా అవుటైనప్పటికీ, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తో కలిసి మంధనా ఇన్నింగ్స్‌ను చక్కదిద్ది జట్టును పటిష్ట స్థితిలో నిలిపింది.

# వన్డేల్లో గిల్ సరికొత్త రికార్డ్..

## ధావన్, కోహ్లీలను అధిగమించిన యంగ్ స్టార్




- వన్డేల్లో అత్యంత వేగంగా 3000 పరుగులు చేసిన భారత ఆటగాడిగా గిల్ రికార్డ్
- శిఖర్ ధావన్, విరాట్ కోహ్లీల రికార్డులను అధిగమించిన యంగ్ ఓపెనర్
- ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో అజేయంగా 84 రన్స్ చేసి జట్టును గెలిపించిన కెప్టెన్

**డిడి9 వార్త:**
భారత యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వన్డే క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో నిన్న జరిగిన తొలి వన్డేలో అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టుకు విజయాన్ని అందించడమే కాకుండా, ఒక అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డేల్లో అత్యంత వేగంగా 3000 పరుగులు పూర్తి చేసిన భారత ఆటగాడిగా గిల్ నిలిచాడు.
గిల్ తన 62వ ఇన్నింగ్స్‌లోనే ఈ మైలురాయిని అందుకున్నాడు. ఇంతకుముందు ఈ రికార్డు 72 ఇన్నింగ్స్‌లలో 3000 పరుగులు చేసిన శిఖర్ ధావన్ పేరిట ఉండేది. విరాట్ కోహ్లీ (75 ఇన్నింగ్స్‌లు) ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే, దక్షిణాఫ్రికా దిగ్గజం హషీమ్ ఆమ్లా (57 ఇన్నింగ్స్‌లు) మాత్రమే గిల్ కంటే ముందున్నాడు.
వర్షం కారణంగా నాలుగు గంటలకు పైగా ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్, గుర్బాజ్ (51 బంతుల్లో 102) మెరుపు సెంచరీతో 194 పరుగులకు ఆలౌట్ అయింది.
195 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. గిల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో సునాయాసంగా విజయం సాధించింది. గిల్ కేవలం 66 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 84 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. లోకేశ్ రాహుల్ (19 బంతుల్లో 39 నాటౌట్) అతనికి చక్కటి సహకారం అందించాడు. దీంతో భారత్ మరో 2.3 ఓవర్లు మిగిలి ఉండగానే 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్ 10 ఆధిక్యంలో నిలిచింది. రెండో వన్డే బుధవారం లక్నోలో, చివరి వన్డే జూన్ 20న చెన్నైలో జరగనుంది.

# ఆ సమయంలో నా సినీ కెరీర్ ముగిసిపోతుందనుకున్నా..



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ ప్రస్తుతం 'ఓ సుకుమారి' షూటింగ్‌లో ఫుల్ బిజీ అయిపోయింది. ఇందులో తిరువీర్ సరసన రొమాన్స్ చేయనుంది. భరత్ దర్శన్ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రాన్ని గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వరరెడ్డి మాలి నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య రాజేష్ తన జీవితంలో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని గుర్తు చేసుకుని ఎమోషనల్ కామెంట్స్ చేసింది. ఒకానొక దశలో తనకు అవకాశాలు లేకపోవడం వల్ల తాను దాదాపు ఆరు నెలల పాటు ఇంట్లోనే ఉన్నట్లు తెలిపింది. అవకాశాలు వచ్చినప్పటికీ తనకు నచ్చిన పాత్రలు, చేయాలని భావించిన కథలు తన వద్దకు రాలేదని అందుకే వచ్చిన వాటిని అంగీకరించలేదని చెప్పింది. నటిగా ప్రతి ఒక్కరి జీవితంలో హై పాయింట్స్, లో పాయింట్స్ ఉంటాయని తన కెరీర్‌లో కూడా అలాంటి పరిస్థితులను తాను చాలాసార్లు ఎదుర్కొన్నట్లు వివరించింది.

ఖాళీగా ఉన్న ఆరు నెలలు తాను చాలా ఆందోళనకు గురయ్యాయని ఎమోషనల్ అయింది. మంచి అవకాశాలు రావడం లేదా? లేక తన సినీ కెరీర్ అక్కడితోనే ముగిసిపోతుందా? అనే ఆలోచనలు కూడా వచ్చాయని తెలిపింది. నటికి అవకాశాలు లేకపోవడంతో ఆ సమయంలో నరకం చూశానని అన్నారు. ఆ సమయంలోనే తనకు 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో నటించే అవకాశం వచ్చిందని ఆ సినిమా తన జీవితాన్ని మార్చిందని పేర్కొంది. ఆరు నెలల తర్వాత మొదటిసారి షూటింగ్ సెట్‌లో పాల్గొన్న క్షణాలు తనకు ఇంకా గుర్తున్నాయని చెప్పకొచ్చింది.

ప్రస్తుతం ఐశ్వర్య రాజేష్ ఓ సుకుమారితో పాటు మహేంద్ర గిరి వారాహి,అండర్-18, ధృవనక్షత్రం వంటి చిత్రాలు కూడా చేస్తోంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ ప్రాజెక్ట్స్ త్వరలోనే థియేటర్స్‌లోకి రాబోతున్నాయి. వైవిధ్యమైన పాత్రలతో ఐశ్వర్య రాజేష్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.

నాచికేత్ సామంత్ దర్శకత్వంలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'బేబీ దూ దై దూ' . ఇందులో హుమా ఖురేషి 'బేబీ కర్మార్కర్' అనే మూగ కాంట్రాక్ట్ కిల్లర్ పాత్రలోనూ, రచిత్ 'సిద్ధు' పాత్రలోనూ నటించారు. ఈ చిత్రంలో సీమా పహ్వా, సికిందర్ ఖేర్, చంకీ పాండే, హిమాన్షు మాలిక్, అరుణ్ కుష్వాహ కీలక పాత్రలో కనిపించనున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 3న థియేటర్లలో విడుదల కానుంది. అయితే ఈ మూవీ షూటింగ్ సమయం నుంచే హుమా ఖురేషి, రచిత్ ప్రేమించుకుంటున్నారనే పుకార్లు షికారు చేస్తున్నాయి. అంతేకాకుండా గత ఏడాది సెప్టెంబర్‌లోనే ప్రపోజ్ కూడా చేశాడని.. హుమా కూడా ఒప్పుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో.. ఈ వార్తలకు బలం చేకూరేలా హుమా ఖురేషి పెట్టిన పోస్ట్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తాజాగా, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా హుమా ఖురేషి, తన రూమర్ బాయ్‌ఫ్రెండ్ రచిత్‌ను పొగడ్తలతో ముంచెత్తింది. తాను రచిత్‌ను మొదటిసారి కలిసినప్పుడు అతని ప్రతిభతో పాటు అతనిలో ఉన్న ఓపిక, పట్టుదల తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు.

బనారస్ లాంటి చిన్న ఊరి నుండి ముంబైకి ఎంతోమంది లాగే రచిత్ కూడా ఒక పెద్ద కలలతో వచ్చాడని.. అయితే మిగతా వారిలా కాకుండా, రాత్రికి రాత్రే సక్సెస్ రాకపోయినా రచిత్ అధైర్యపడి ఇండస్ట్రీని వదిలిపెట్టి వెళ్ళిపోలేదని ఆమె ప్రశంసించారు. ఇక్కడే ఉండి కష్టపడ్డాడని, కొత్త విషయాలు నేర్చుకుంటూ తనను తాను మార్చుకున్నాడని అన్నారు. తన టైమ్ వస్తుందనే నమ్మకాన్ని రచిత్ ఎప్పుడూ కోల్పోలేదని.. ఎలాంటి అడ్డదారులు తొక్కకుండా కేవలం కష్టాన్ని, నిలకడను నమ్ముకున్నాడని హుమా కొనియాడారు. దీనికి రచిత్ స్పందిస్తూ.. నన్ను అందరికీ ఇంత పవర్‌ఫుల్‌గా పరిచయం చేసినందుకు హుమీకి చాలా థాంక్స్ అని రచిత్ ఆనందం వ్యక్తం చేశారు. తన మీద తనకే నమ్మకం లేని రోజుల్లో కూడా తనను నమ్మి, ఎల్లప్పుడూ నిజమైన మద్దతుదారుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. షూటింగ్ సెట్‌లోనైనా, బయటైనా హుమా దగ్గర నేర్చుకోవాల్సింది చాలా ఉందని.. ఇద్దరం కలిసి సాగిస్తున్న ఈ ప్రయాణం తన జీవితాన్ని ఎంతో అందంగా మార్చేసిందని రచిత్ సింగ్ ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఈ పోస్టులతో వారి ప్రేమపై హింట్ ఇచ్చారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు



**అతనిలో ఉన్న ఆ గుణాలే నన్ను ఆకట్టుకున్నాయి..**



## భారీ రెమ్యునరేషన్ అడిగిన త్రిష.. బిత్తరపోయిన నిర్మాత

చిత్ర పరిశ్రమలో ఏ నటికైనా క్రేజ్ ఉన్నంతవరకే డిమాండ్ ఉంటుంది. ఒక్కసారి సక్సెస్ ట్రాక్ ఎక్కి, పాపులారిటీ అమాంతం పెరిగిపోతే ఆటోమేటిగ్గా పారితోషికం కూడా ఆకాశాన్ని తాకడం సహజం. ఇప్పుడు సీనియర్ స్టార్ హీరోయిన్ త్రిష కూడా సరిగ్గా ఇదే పని చేస్తోంది. ఇటీవల సూర్య సరసన నటించిన 'కరుప్పు' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడంతో ఈ 43 ఏళ్ల బ్యూటీ డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ప్రస్తుతం ఈ క్రేజ్‌ను పూర్తి స్థాయిలో క్యాష్ చేసుకునే పనిలో పడింది ఈ సీనియర్ భామ. తాజాగా ఓ పెద్ద సినిమాలో త్రిషను హీరోయిన్‌గా తీసుకోవడానికి చిత్ర యూనిట్ సంప్రదించగా.. వారికి ఊహించని షాక్ తగిలింది. తమిళం, తెలుగు భాషల్లో ద్విభాషా చిత్రంగా భారీ బడ్జెట్‌తో రాబోతున్న ఆ సినిమాలో నటించేందుకు త్రిష ఏకంగా రూ. 15 కోట్ల పారితోషికాన్ని డిమాండ్ చేసినట్లు ఫిలింనగర్ టాక్. హీరోయిన్ల విషయంలో ఈ స్థాయి రెమ్యునరేషన్ వినడం టాలీవుడ్, కోలీవుడ్ వర్గాలకు పెద్ద షాకింగ్ అనే చెప్పాలి. త్రిష అడిగిన అంత భారీ మొత్తాన్ని చూసి సదరు నిర్మాత ఒక్కసారిగా అవాక్కయ్యారట. ప్రస్తుతం ఆ సినిమా నిర్మాతలు త్రిషను కనీసం రూ. 10 కోట్ల రూపాయల బడ్జెట్ పరిధిలోకి ఒప్పించేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి సరసన నటించిన 'విశ్వంభర' చిత్రానికి త్రిష దాదాపు రూ. 4 కోట్ల వరకు తీసుకోగా 'కరుప్పు' సినిమా సక్సెస్ తర్వాత త్రిష రేంజ్ మారిపోయింది. ప్రస్తుతం సౌత్ ఇండియాలోనే అత్యధిక పారితోషికం తీసుకుంటున్న నటిగా నయనతార రికార్డు సృష్టించగా.. ఇప్పుడు త్రిష డిమాండ్ చూస్తుంటే ఆ రికార్డును కూడా దాటేసేలా కనిపిస్తోంది. మరి ఈ 15 కోట్ల డీల్‌కు నిర్మాతలు ఓకే చెప్తారో లేదో చూడాలి!

## 'మాయాబజార్' సెట్స్ చూసిన మహానుభావుడితో సినిమా..

సినిమా ఇండస్ట్రీలో కొన్ని కాంబినేషన్లు, కొన్ని ప్రాజెక్టులు కేవలం వ్యాపారం కోసం కాకుండా.. ఒక పెద్ద సంకల్పంతో, నమ్మకంతో జరుగుతుంటాయి. తాజాగా టాలీవుడ్‌లో విడుదలై, ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తూ 'మహానటి' రేంజ్ గుడ్‌విల్‌ను సొంతం చేసుకున్న ఓ డిఫరెంట్ మ్యూజికల్ ఫిల్మ్ 'సింగ్ గీతం'. తాజాగా నిర్వహించిన ఈ చిత్ర సక్సెస్ మీట్‌లో ఈ మూవీ నిర్మాత, డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఎమోషనల్ స్పీచ్ ఇచ్చారు. లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు గారితో ప్రయాణం, ఈ సినిమా వెనుక పడిన శ్రమను ఆయన పంచుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "నిజం చెప్పాలంటే నాకు మాటలు రావడం లేదు, స్పీచ్‌లెస్. ఏడేళ్ల క్రితం 'మాయాబజార్' సినిమా సెట్స్‌పై సావిత్రి గారిని నేరుగా చూసిన, కె.వి.రెడ్డి గారి దగ్గర తిట్లు తిన్న, 'ఆదిత్య 369' లాంటి అద్భుతాన్ని సృష్టించిన ఆ మహానుభావుడిని (సింగీతం శ్రీనివాసరావు గారిని) జీవితంలో ఒక్కసారి కలిసి హ్యాండ్‌షేక్ ఇస్తే చాలు అనుకున్నాను. కానీ ఈరోజు ఆయనతోనే కలిసి సినిమా చేసే అవకాశం రావడం వెనుక ఏదో ఒక దైవ సంకల్పం ఉందనే నేను నమ్ముతాను. నేను కేవలం దారి క్లియర్ చేశానంతే.. మీరంతా ఒక నదిలా మారి ఈ సినిమా అనే సముద్రాన్ని



## సెకండ్ వీకెండ్‌లోనూ తగ్గని జోరు.. బుక్‌మైషోలో రికార్డుల వేట!




తెలుగు సినిమా బాక్సాఫీస్ వద్ద ప్రస్తుతం PEDDI పేరు మార్మోగిపోతోంది..మొదటి వారం అద్భుతమైన వసూళ్లను సాధించిన ఈ చిత్రం, రెండో వారంలోనూ అదే దూకుడును ప్రదర్శిస్తూ ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఒకానొక దశలో కలెక్షన్లు కాస్త స్లో అయ్యాయేమో అనుకునేలోపే, మళ్లీ పుంజుకుని బాక్సాఫీస్ రేసులో దూసుకుపోతోంది. మిక్స్ టాక్ ఉన్నా కంటెంట్ ఫ్యామిలీ ఆడియన్స్ కి రీచ్ అయితే ప్రేక్షకులు థియేటర్లకు ఎలా బ్రహ్మరథం పడతారో ఈ సినిమా మరోసారి నిరూపించింది.

రెండో వీకెండ్‌లో ఈ సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులతో కళకళలాడుతున్నాయి. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ 'బుక్‌మైషో'లో ఈ చిత్రం సృష్టిస్తున్న హవా అంతా ఇంతా కాదు. కేవలం గత ఒక్క గంటలోనే ఏకంగా 9.78 వేల టికెట్లు అమ్ముడయ్యాయంటే ఈ సినిమా క్రేజ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం సగటున గంటకు దాదాపు 10 వేల టికెట్ల చొప్పన బుక్ అవుతూ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల వైపు అడుగులు వేస్తోంది. వీకెండ్ కావడంతో ఈ నంబర్స్ మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మొత్తానికి, 'పెద్ది' వసూళ్ల సునామీ ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు. ప్రేక్షకుల మనసులను గెలుచుకుంటూ, కలెక్షన్ల వర్షం కురిపిస్తూ లాంగ్ రన్ వైపు ఈ చిత్రం దూసుకెళ్తోంది.

## మన సినిమాలను చంపేస్తూ.. హాలీవుడ్ బెస్ట్ అంటున్నారు..



బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ సినిమాల కంటే ఎక్కువగా వివాదాస్పద వ్యాఖ్యలతోనే నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. ఇండస్ట్రీలో చోటుచేసుకునే విషయాలపై తనదైన శైలిలో రియాక్ట్ అవుతూ.. అందరినీ ఆలోచింపజేస్తుంటారు. తాజాగా, అనురాగ్ కశ్యప్ థియేటర్ల యాజమాన్యాలపై మండిపడ్డారు. హాలీవుడ్ హిట్ చిత్రం 'అబ్సెషన్' కే ఎక్కువ షోలు ఇస్తూ బెస్ట్ అన్నట్లు వ్యవహరిస్తూ, మన లోకల్ సినిమాలు మెయిన్ వాపస్ ఆవుంగా, గవర్నర్, హాంటెడ్ 3D, 'బందర్' వంటి వాటిని చంపేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తూ.. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. "అబ్సెషన్' సినిమాను అందరూ చూడాలనుకోవడంలో తప్పు లేదని, కానీ దానికి తక్కువ షోలు ఇచ్చినా ఎక్కువ రోజులు ఆడుతుందని ఆయన అన్నారు. మన సొంత చిత్రాలకు మంచి షో టైమింగ్స్ ఇచ్చి ఆదరించకపోతే, భారతీయ సినిమా ఎలా ఎదుగుతుందని ప్రశ్నించారు. బెంగళూరులో మెయిన్ వాపస్ ఆవుంగా, గవర్నర్ వంటి సినిమాలకు కేవలం ఒక్క మార్నింగ్ షో మాత్రమే ఇస్తూ చంపేస్తున్నారని, కానీ హాలీవుడ్ మూవీని మాత్రం బెస్ట్ అంటూ రోజుకు 6 నుండి 7 షోలు కేటాయించడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక తెలుగు సినిమా 'సింగ్ గీతం'కు బెంగళూరులో మొత్తానికి ఒక్క షో కూడా ఇవ్వలేదని ఫైర్ అయ్యారు.అంతేకాకుండా కలెక్షన్లు రివీల్ చేస్తూ.. థియేటర్స్ వద్ద మన చిత్రాలు పడుతున్న ఇబ్బందిని వివరించారు. ఒక నటుడు-మ్యూజీషియన్ జీవితం చుట్టూ తిరిగే కథతో నా దర్శకత్వంలో వచ్చిన 'బందర్' చిత్రం గత వారం రూ.4 కోట్ల వరకు వసూలు చేసింది. మరోవైపు, ఒక అబ్బాయి తన క్రష్ గురించి కోరుకున్న కోరిక ఎలాంటి భయానక మలుపులు తీసుకుందనే కథతో వచ్చిన హాలీవుడ్ హారర్ చిత్రం 'అబ్సెషన్' ఇండియాలోనే రూ.60 కోట్లకు పైగా వసూలు చేసి భారీ హిట్‌గా నిలిచిందని అన్నారు. ఇక ఈ హాలీవుడ్ క్రేజ్ వల్ల స్థానిక సినిమాలు థియేటర్ల దొరక్క ఇబ్బంది పడుతున్నాయని అనురాగ్ కశ్యప్ పేర్కొన్నారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500151. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502515.